ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 05, 2015

అరవయేళ్ళ అపురూప చిత్రం

కన్యాశుల్కం



నా కథ

లారా దత్తా

శ్రీదేవి

నేత చీరల్లో నాయికలు

వేసవి కాలంలో కాటన్ చీరలు హాయిగా వుంటాయి. హుందాతనాన్నీ ఇస్తాయి. అలాంటిది సినిమాల్లో కథానాయికలే నేత చీరల్లో దర్శనమిస్తే...? 'అబ్బే! హీరోయిన్ల బట్టలు, మేకప్‌కు బోలెడంత అట్టహాసం వుంటుంది. దర్శకనిర్మాతలు కూడా అందుకు చెప్పలేనంత ప్రాధాన్యతనిస్తారు. అందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి కూడా వెనకాడరు. వాళ్లెందుకు కాటన్ చీరలు కడతారు?!' అనేవాళ్లూ వుంటారు. కానీ... కాటన్ చీరల్లో మెరిసిన, ప్రేక్షకులను మెప్పించిన కథానాయికలు వున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. అంతేనా! ఆ దెబ్బతో నేత చీరలు ఫ్యాషన్ అయి కూర్చున్నాయంటే నమ్మబుద్ధి కాదు. ఇటీవలి కాలంలో అలా అగుపించిన ఆరుగురు హీరోయిన్లు, సినిమాల గురించి సూక్ష్మంగా చెప్పకుందాం. శ్రీదేవి (ఇంగ్లీష్ వింగ్లీష్), మాధురీ దీక్షిత్ (గులాబీ గ్యాంగ్), కత్రీనా కైఫ్ (రాజ్‌నీతి), దీపికా పదుకొనే (ఖేలేం హమ్ జీ జాన్ సే), లారా దత్తా (బిల్లూ), ఐశ్వర్యా రాయ్ (మిస్ట్రెస్ ఆఫ్ స్పైసెస్) నటించిన చిత్రాలే అందుకు నిదర్శనం. పట్టుదలతో ఇంగ్లీషు నేర్చుకునే సాధారణ గృహిణిగా శ్రీదేవి నటనను చూసి ముచ్చటపడని వారుండరేమో! భర్తలు పెట్టే చిత్రహింసలను ఎంతకాలమని భరిస్తారు. ఎదిరించాలని చెప్పే పాత్రలో మాధురీ దీక్షిత్‌ను మర్చిపోలేం. సింగిల్ పీస్, టూ పీస్‌లలో చూసిన కత్రీనాను ఓ రాజకీయ నాయకురాలిగా చీరకట్టులో అందునా నేత చీరల్లో చూసి ఆశ్చర్యపోని వారుండరు. ఓ బీద క్షురకుని భార్యగా లారా దత్తా కూడా కాటన్ చీరలో చక్కగా నటించింది. ఇక దీపిక, ఐశ్వర్యల సంగతి చెప్పేదేముంది! కాస్ట్యూమ్స్ ఎలాంటివనే వాటితో ప్రమేయం లేకుండా తమదైన నటనతో అభిమానుల హృదయాలను కొల్లగొట్టడంతో దిట్టలు కదా. ●

ఐశ్వర్యా రాయ్

కత్రీనా కైఫ్

మాధురీ దీక్షిత్

దీపికా పదుకొనే

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కూల్ కూల్‌గా...

వేసవి కాలమంటేనే ఎర్రటి ఎండలు. చికాకు పెట్టే చెమటలు. ఊపిరాడనంత ఉక్కపోత ...చిగురుటాకులు సైతం కదలనంత స్థబ్దత. ఇల్లు దాటి కాలు బైట పెట్టలేం. అలాగని ఇంట్లో వుండలేం. ఎన్ని నీళ్లు తాగినా దప్పిక తీరదు. ఏవీ తినాలనిపించదు. ప్రాణం తేలిపోతుంటుంది. వయసు పైబడిన వాళ్లకే కాదు. అన్ని వయసుల వారిదీ అదే సీను. అయినా... చుట్టూ వాతావరణం ఇలా వుంటే ఎవరికి మాత్రం చిరాగ్గా పరాగ్గా వుండదు!

● ● ● ●

భానుడి ప్రతాపం నుంచి బైటపడేందుకు చిరు ప్రయత్నాలు చేస్తుంటాం. ఆశా జీవులం కదా. చల్లగా ఏం దొరుకుతుందా అని వెతుకుతాం. కొత్త కుండలో నిల్వ ఉన్న చల్లటి నీళ్ల కోసం తపించిపోతాం (అయినా చద్ది పెట్టెలొచ్చాక కుండల గోల ఎవరికి పట్టింది! చాదస్తం కాకపోతే అంటారేమో)! చల్లటి అంటే గుర్తొచ్చింది. కడుపు నిండా చల్ల (మజ్జిగ) తాగాలని పరితపించిపోతాం. హాయిగా వేప చెట్టు కింద నులక మంచం వేసుకుని చల్లగాలికి సేద తీరాలని ఉబలాటపడతాం. అటుగా ఐస్ బండి అబ్బి వస్తే... పుల్లైసు కొనుక్కొని చప్పరించాలని తహతహలాడతాం. గోలీ సోడా తాగి తేన్చాలనుకుంటాం. పచ్చి పులుసు, మజ్జిగ చారుతో నాలుగు మెతుకులు తినాలనుకుంటాం. ఎండలవేళ చల్లబడడానికి పల్లెవాసులు పడే తిప్పలివన్నీ. పట్నవాసులలా కాదు. హిమక్రీములు, శీతల పానీయాలూ, ఏసీలూ, ఎయిర్ కూలర్లూ, రిఫ్రిజిరేటర్లూ, వేళ్ల పరదాలు...ఇన్నిటిని వాడతారు చల్లబడడానికి. వీటికి తోడు చలవ కళ్లద్దాలూ, గొడుగులూ వుండనే వున్నాయి.

● ● ● ●

ఏదేమైనా మనది ఉష్ణదేశం కనక ప్రతిదీ కూల్‌గా వుండాలని కోరుకుంటాం. చలి దేశాల్లో అలా కాదు. వాళ్లకి మంచు కురుస్తుంది వానలాగా. దాంతో ప్రతిదీ వేడిగా వుండాలి. అందుకే ఉన్నిదుస్తుల్లో వెచ్చబడుతుంటారు. రూమ్ హీటర్ల ముందర కూర్చుని వెచ్చగా వైన్ స్వాహా చేసేస్తారు. ఇళ్లల్లో, కార్యాలయాల్లో...ఆఖరుకు వాహనాల్లో కూడా వెచ్చగా వుండాలనుకుంటారు. విశిష్ట అతిథులను ఆహ్వానించేప్పడు సైతం 'వామ్ వెల్‌కమ్' పలుకుతారు. మనమేమో ఘనస్వాగతమంటాం. మన దగ్గర జంతువులు చల్లబడడానికి చెరువుల్లో, మురికి నీళ్లలో మునుగుతుంటే... చలిప్రాంతాల్లో దీర్ఘ నిద్రనో, వలసలనో ఎంచుకుంటుంటాయి.పశు పక్ష్యాదులు మనం చెరువుల్లో ఈది చల్లబడాలనుకుంటే... వాళ్లు వేడినీళ్ల ఈతకొలనుల్లో ఈదాలనుకుంటారు. మనం చల్లటివి తినాలనుకుంటే వాళ్లు వేడి వేడిగా పొగలు కక్కేవి లాగించాలనుకుంటారు. మన మాటల్లో కూడా 'కూల్' అనే పదాన్ని ఎక్కువగా వాడేస్తుంటాం. ఎవరికైనా కోపం వస్తే 'కూల్ డూడ్' అనో, 'చిల్ బాస్' అనో అంటుంటాం. పెద్దలకు తొలిసారిగా నమస్కరించినప్పడు కూడా 'పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో చల్లగా వుండమని' దీవిస్తారు అందుకేనేమో.

■

◆ మనలో మాట

టపా

వేసవి బాల

పిల్లలకోసం ప్రతి వారం రెండు పేజీల్లో 'బాల నేస్తాలు' ఇవ్వడం బాగుంది. అయితే ఎండాకాలం సెలవులు ఇస్తున్నారు. చిన్నారులు ఇంట్లోనే వుంటారు. కాబట్టి వేసవిలో వారు నేర్చుకోవాల్సిన అంశాలను, పజిల్లను, సైన్సు ప్రయోగాలను, మరింత ఆసక్తికరంగా ఇస్తే బాగుంటుంది. కాసేపు కూర్చుని ఆ పుస్తకంతో కుస్తీ పట్టేట్టు ఇవ్వండి. చివరి పేజీలో రంగుల్లో ఇచ్చిన ఇళ్ల వంతెన ఆసక్తికరంగా వుంది. ఈ బొమ్మలు చూశాక...నిజంగానే ఇలాంటి ఇళ్లు వుంటే ఎంత బావుంటుంది అనిపించింది. కానీ అడవుల్లోనే ఇది సాధ్యమౌతుంది. ఏమైనప్పటికీ ఊహించని ఇంటిని, బ్రిడ్జిని బొమ్మల్లోనైనా చూడగలిగాం.

కంది మాధవ్, ఉయ్యూరు.

ఆమెకు ఏదీ సరి కాదు

జార్ఖండ్‌లో జరిగిన కుని ఆపరేషన్ల దుర్ఘటన వల్ల భార్యలను కోల్పోయిన వారిలో రూప్‌చంద్ ఒకరు. ముగ్గురు పసిబిడ్డలను సాకాల్సిన బాధ్యత అతని మీద పడింది. భార్య లేని లోటును జీర్ణించుకోలేని స్థితిలో వున్నాడతను. ప్రభుత్వం ఎంత నష్టపరిహారం ఇచ్చినా అది భార్య లేని లోటును పూడ్చలేదని అతను బహిరంగంగా చెప్పిన మాట విన్నాకైనా ప్రభుత్వాలు మేల్కొంటే భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

ఎల్. సంపత్, కడప.

ఎన్ని ఉగాదులో ..

ఉగాది తెలుగు ప్రజలకు తొలి పండుగ అదే విధంగా వివిధ రాష్ట్రాల ప్రజలు రకరకాలుగా జరుపుకుంటారనదే నమ్మలేకుండా ఉన్నాం. మన పక్కన్నే ఉన్న తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా ఇంత ఘనంగా జరుపుకుంటారని మాకు ఇప్పుడే తెలిసింది. ఉగాది రోజున ఎన్నేసి ఊసులో, రుచులతో మాకు ఉగాది లాంటి వ్యాసం అందించినందుకు చాలా సంతోషంగా వుంది.

సుశీల, రాయచోటి.

కలర్ పేజీలు సూపర్

ఈ వారం మూడు కలర్ పేజీలు చాలా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కుక్కలను పోషించడం చాలా బాగుంది. మూగజీవుల ఆ వేదనను అర్థం చేసుకొని వాటిని పోషిస్తున్న వాంగ్ యాన్‌ఫాంగ్ అనే మహిళను తప్పక అభినందించాలి. అలాగే స్టైలిష్ స్టార్ అనగానే టక్కున గుర్తు వచ్చేది అమితాబ్. స్టైల్ అనేది కేవలం వ్యక్తిగతం. అలాగే తమకు సౌకర్యవంతంగా ఉండాలి అని చెప్పిన హృతిక్ మాటల్లో వాస్తవం దాగుంది.

రాము,నెల్లూరు,

చిన్ని ఆశ తీరాలి

మన్మధ నామ సంవత్సరం సందర్భంగా జనంలో దాగి వున్న చిన్ని చిన్ని ఆశల గురించి చక్కగా ఇచ్చారు. మనలో మాటలో చెప్పినట్టు... నిజంగానే మనకు ఏం తక్కువ?! వనరులు లేవా? పని చేసే జనం లేరా? మరి ఎందుకు సామాన్యుడి ఆశలు తీరవో అర్థం అయ్యేది కాదు. పాలకులకు చిత్తశుద్ధి వుండాలేకానీ...ఏదైనా సాధ్యమే. చాసో కథను మళ్లీ చదివే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషం. ఈ మధ్య మంచి కథ చదువుదామన్నా కనిపించడం లేదు. అలాంటిది ఈ కథ చదివే సరికి ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. భిక్షగాళ్ల జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు చాసో. ఓ అమ్మాయి తోటి భిక్షగాళ్లలో ఒకరిని తన భాగస్వామిగా ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు ఎలా ఆలోచించాలో ఆ తండ్రి వైపు నుంచి చక్కగా చెప్పారు రచయిత. పేరు పొందిన రచయితల పాత కథలు ఇస్తుండండి. చదివి సంతోషిస్తాం.

టి. వసుధ, బోడిపాలెం, గుంటూరు.

ఈ సంచికలో....

నా కథం

కవర్‌స్టోరీ 14

విశాలమైన సముద్రతీరం...
ఆహ్లాదపరిచే పర్వతాల తోరణం ...
ప్రతిష్ఠాత్మకమైన పరిశ్రమల సముదాయం ...
పరవశం కలిగించే పర్యాటక సోయగం ...
ఇవన్నీ ఒక దగ్గర కుప్ప పోస్తే ఏమవుతుంది? ఏ పట్టణం రూపు దిద్దుకుంటుంది?

యువ 3
కష్టపడి పనిచేయడాన్ని నమ్ముతా

తెలుసా....? 4

వింతలోకం 5
నడిరోడ్డు మీద సమాధి

కథ 6
పేరు..ఇంటిపేరు

నవ్వుల్ - పువ్వుల్ 8

సినిమా కబుర్లు 9
అరవయ్యేళ్ల అపురూప చిత్రం కన్యాశుల్కం

ప్రత్యేకం 11
ఆ గ్రామం గంగను జయించింది

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
ఇంగువ సాంబారు

బాలనేస్తాలు 22
ఎక్కడ దాక్కుంది!

కొత్త పుస్తకాలు 24
వివక్షపై ఎక్కుపెట్టిన ఆయుధం

చరిత్రగా మారిన చిత్రకారుడు
.... 12

◆ యువ

సైనా నెహ్వాల్! ఇప్పుడీమె సాదా సీదా క్రీడాకారిణి కాదు. ప్రపంచ బాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్న తొలి భారతీయ షట్లర్. తన మనసులోని మాటలను ఇదిగో ఇలా చెప్పుకొచ్చిందో సందర్భంలో....

కష్టపడి పని చేయడాన్ని నమ్ముతా

మీకు ఇష్టమైన మాట

గెలుపు

ఎక్కువగా వినేది

కొత్త సినిమా పాటలు

నచ్చని శబ్దం

భయంతోకూడినదేదైనా

మీ కల

ఒలింపిక్ బంగారు పతకం

జీవితంలో మర్చిపోలేని సిద్ధాంతం

కష్టపడి పనిచేయి

నరమానవుడు కూడా లేని ఎడారికి మీతోపాటు మరొక్కరిని తీసుకెళ్లేందుకు అనుమతిస్తే... అది ఎవరై వుంటుంది?

నా అభిమాన ఆట బాడ్మింటన్ ఆడుకోవడానికి ఒకరిని తీసుకెళతాను

ఇష్టమైన ఆహారం

భారతీయ వంటకాలే. బ్రెడ్డు, కూరగాయలు, పెరుగు, కొద్దిగా చికెన్ వుంటే చాలు.

బాడ్మింటన్ బరిలోకి ఆహ్వానిస్తూ మీ పేరు పెట్టి పిల్చినప్పుడు ఎలాంటి భావోద్వేగాలకు గురవుతారు?

చాలా గర్వంగా వుంటుంది. గెలుపు సాధించాలనుకుంటాను.

ఇప్పటికీ బాధపడిపోయే సందర్భం...

2008లో ఒలింపిక్స్ పతకాన్ని చేజార్చుకోవడం

డబుల్స్‌లో మీరు చాలా ఆసక్తికరమైన పోటీనిచ్చారు. ముందుగా దేన్ని ఎంచుకుంటారు?

నేను సింగిల్స్ మాత్రమే ఆడతాను

నిల్చిపోయే జ్ఞాపకాలను పంచిన ప్రయాణం!

సింగపూర్– ఓ అందమైన నగరం

షటిల్ కాక్‌ను చూసినప్పుడు ఏం గుర్తొస్తుంది?

నా లక్ష్యం

మీ జీవితంలో అత్యంత ప్రధానంగా నిలిచే మహిళ/పురుషుడు

నన్ను ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చిన నా తల్లిదండ్రులు

మీరు ఎక్కడ వున్నప్పుడు మీ గుండె వేగంగా కొట్టుకుంటుంది?

వేదిక మీద నిలబడ్డప్పుడు

బాడ్మింటన్ కోర్టులో ... ఆట మీద కేంద్రకరణ తగ్గే సందర్భం...

ఆటలో చిన్న చిన్న తప్పులు చేసినప్పుడు

పెళ్లికి ముందు సహజీవనంపై నమ్మకం వుందా?

లేదు

రానున్న పదేళ్లలో మిమ్మల్ని ఎలా చూడాలనుకుంటున్నారు?

బాడ్మింటన్‌లో ప్రపంచంలోకెల్లా గుర్తుంచుకోదగిన భారతీయ మహిళగా...

వ్యక్తిగతం...

పేరు : సైనా నెహ్వాల్

దేశం : భారత్

జననం : 17 మార్చి 1990 (హిసార్-హర్యానా)

వయసు : 25

నివాసం : హైదరాబాద్

ఎత్తు : 1.65 మీ. (5.5)

బరువు : 60 కేజీలు

ఆడేది : కుడిచేతితో

కోచ్‌లు : అతిక్ జౌహారి, పుల్లెల గోపిచంద్, విమల్ కుమార్

టాప్ ర్యాంకింగ్ : నెంబర్ 1 (30 మార్చి 2015)

కరెంట్ ర్యాంకింగ్ : నెంబర్ 1 (30 మార్చి 2015)

ప్రత్యేకతలు : కరాటేలో బ్రౌన్‌బెల్ట్

అవార్డులు : అర్జున్ అవార్డు(2009), రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న(2009-2010), పద్మశ్రీ(2010)

◆తెలుసా...?

❑ ప్రపంచంలోని నదీజలాల్లో మనం వుపయోగించుకుంటోంది 12 శాతం మాత్రమే.

❑ కోడిపెట్ట ఏడాదికి సగటున 19 డజన్ల గుడ్లు పెడుతుంది.

❑ నీరుగాని, విస్తారంగా చెట్లుగాని లేని ఇసుక భూమి ఎడార్లు భూమిమీద 2 కోట్ల చదరపు కిలోమీటర్ల మేర వ్యాపించి వున్నాయి.

❑ గొరిల్లాలు రోజుకి 14 గంటలపాటు గుర్రు పెట్టి నిద్రపోతాయి.

❑ మనిషి కంటే శునకానికి కంటి చూపు మెరుగ్గా వుంటుంది.

❑ నల్ల ఎలుగుబంటికి పెంపుడు పిల్లులంటే భయమట. వాటి నుంచి కాపాడుకోడానికి అది చెట్టు ఎక్కేస్తుందట.

❑ గబ్బిలాలు ఎటువంటి ఆహారాన్నైనా తినగలవు. ఇదే రకం ఆహారం కావాలన్న పట్టింపులేం లేవు వాటికి.

❑ ఆవు తన జీవిత కాలంలో 200,000 గ్లాసుల పాలు ఇస్తుంది.



❑ ఆక్టోపస్‌కు 3 గుండెలు!

❑ నీటి ఏనుగు నుంచి వెలువడే గులాబి రంగు చెమటే దాని చర్మాన్ని ఆరోగ్యవంతంగా వుంచుతుంది.

❑ బొద్దింక తల లేకుండా కూడా కొన్ని వారాలపాటు బతకగలదు. అయితే ఆహారం తీసుకోకపోవడం వల్ల చివరకు అది చనిపోతుంది.

❑ మొసళ్లకు పళ్లు ఊడిపోయినా మళ్లీ మళ్లీ వస్తూనే వుంటాయి.

❑ మనం కళ్లు తెరుచుకుని పగటి కలలు కంటుంటాం. డాల్ఫిన్లు కళ్లు తెరుచుకునే నిద్రపోతాయి.

❑ కాకి చిప్ప అని పిలవబడే గుల్ల చేపకు నీలం రంగు కళ్లు 35 వుంటాయి.

❑ ఆవుకు చెమట గ్రంథులు ముక్కులో వుంటాయి.



❑ ఇతర జంతువులకంటే జిరాఫీలకు బీపీ ఎక్కువ వుంటుందట.

❑ ఎలుక నీళ్లు లేకుండా ఒంటె కంటే ఎక్కువరోజులు వుండగలదు.

❑ చేపలకు కనురెప్పలుండవు.

❑ డాల్ఫిన్లలో మనుషుల్లోకంటే పెద్ద మెదడు వుంటుంది.

❑ గత నాలుగు వేల సంవత్సరాల్లో మనిషి కొత్తగా మచ్చిక చేసుకున్న జంతువు లేదు.

❑ చీమలు నీటి లోపల రెండు రోజుల వరకు బతకగలవు.

❑ కోలా ఎలుగుబంట్ల వేలి ముద్రలు మన వేలి ముద్రలను పోలి వుంటాయి.

❑ గోల్డ్ ఫిష్‌ను కొన్ని ఏళ్ల పాటు చీకటి గదిలో వుంచితే అది తెల్లగా మారుతుంది!



❑ ఆకాశంలో వెలిగే సూర్యుడు ఒక్కడే. కానీ అంటార్కిటికాలో కొన్ని చోట్ల మంచు వాతావరణం మీదుగా కాంతిప్రయాణించి బింబ ప్రతిబింబాలు ఏర్పడి మనల్ని నాలుగైదు సూర్యబింబాలున్నట్లు భ్రమింపచేస్తాయి.

❑ 1901లో సహారా ఎడారిలో చెలరేగిన ఇసుక తుఫాను 20 లక్షల టన్నుల ఇసుకను, ధూళిని తీసుకొని, 2 వేల మైళ్లు ప్రయాణం చేసి యూరపు ఖండంపై వర్షించింది.

❑ సాధారణంగా మనం చూసే చెట్టు వేళ్లు కొద్ది గజాల దూరం మాత్రమే నేలలోకి వెళతాయి. కానీ దక్షిణాఫ్రియాలోని ఒక రకపు ఫిగ్ వృక్షం వేళ్లు 400 అడుగుల లోతున భూమిలోకి చొచ్చుకుపోతాయి.

❑ డక్‌బిల్ తన దవడసంచుల్లో 600 పురుగులను నిల్వ చేసుకోగలదు.

❑ ఆవుకి సంగీతం వినిపిస్తే ఎక్కువ పాలిస్తుంది!

✦

సీసాల ఇల్లు

కొందరికి ఇల్లు కూడా వెరైటీగా వుండాలి. అందరి చూపూ దానిమీదే వుండాలి. అలాంటి ఇల్లు కట్టాలంటే ఇంకాస్త వెరైటీగా ఆలోచించాలి. అలాంటి ఇల్లే ఇప్పుడు మీ ముందుకొచ్చింది. చూశారుగా. ఇది సీసాలతో కట్టిన ఇల్లు. అదీ మామూలు సీసాలు కాదండోయ్. చాంపేన్ సీసాలతో కట్టినది. రష్యా పెద్దాయనకు వచ్చింది లెండి ఈ ఆలోచన. హమీదుల్లా ఇల్చిబేవ్‌కు ఇద్దరు పిల్లలు. వారు కూడా ఎప్పుడూ తండ్రిని ప్రోత్సహిస్తుండేవారు వెరైటీగా ఇల్లు కట్టమని. ఓసారి అనుకోకుండా ఆయన పద్దెనిమిదేళ్ల కుమారుడు చనిపోయాడు. దాంతో ఆ పిల్లవాడి కోరిక మేరకు సీసాల ఇల్లు కట్టాలని తీర్మానించుకున్నాడు. అనుకున్నదే తడవుగా చాంపేన్ సీసాలను వీలైనంత వరకు కొన్నాడు. ఇరుగు పొరుగు రెస్టారెంట్ల వారు ఉచితంగా ఇచ్చినవి కూడా కలిపి ఇదిగో ఈ ఇల్లు కట్టేశాడు. సీసాల సేకరణకే మూడేళ్లు పట్టింది. ఇప్పుడా ఇల్లు పెద్ద సందర్శనీయ స్థలంగా తయారైందనుకోండి. అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఆ అందాల సీసాల ఇంటిని తన పెద్దకొడుకు పెళ్లి సందర్భంగా కొత్త జంటకు బహూకరించాడు. కోడలికి కూడా తెగ నచ్చేసిందట సీసాల ఇల్లు.

ఒకటికి పోతే...తడిచిపోతారు

ఇంట్లోంచి కాలు బయటకు పెట్టామూ అంటే గోడలమీద వంటికిపోయే దృశ్యాలు పునరావృతమౌతూ వుంటాయి. చూసే వాళ్లకు సిగ్గు పుట్టాల్సిందే కానీ పోసే వాళ్లకు మాత్రం అదేం కనిపించదు. అందుకు జర్మనీలోని ఒక సిటీవారు ఓ పరిష్కారమార్గాన్ని కనిపెట్టారు. దాంతో ఎవరైనా సరే తోక జాడిస్తే... వారి మూత్రంలో వారే తడిచిపోవడం ఖాయం. అదెలాగంటారా! ఏం లేదండీ! ఇంటి గోడలకు 'హైడ్రోఫోబిక్ పెయింట్' వేస్తే సరి. ఆ గోడ మీద పోసిన మూత్రం తిరిగి బూమరాంగ్‌లా అదే వ్యక్తి మీద పడి తడిపేస్తుంది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేసింది. రెండంటే రెండు రోజుల్లో 200,000 మంది ఈ వీడియోని వీక్షించారట. ఆ పెయింటేదో ప్రధాన రహదారుల్లోని గోడలకు కూడా వేస్తే నయం అనిపిస్తోందా!



నడిరోడ్డుమీద సమాధి

సాధారణంగా సమాధులు శ్మశాన వాటికలో వుంటాయి. నడిరోడ్డుమీద వుంటే విచిత్రమే కదా. నాన్సీ కెర్లిన్ సమాధి సరిగ్గా అలాగే దర్శనమిస్తుంది. కాకపోతే చూడాలనుకున్న వారు ఇండియానా వెళ్లాలి. జాన్సన్ కౌంటీలోని రోడ్ 400 దగ్గర కనిపిస్తుందా సమాధి. మన దేశంలో అయితే గుళ్లూ గోపురాలూ కనిపిస్తాయి రోడ్డుకు అడ్డంగా. కాకపోతే అందుకు భిన్నంగా ఇక్కడ సమాధి కనిపిస్తుందంతే. 1831లో జరిగిన ఓ రోడ్డు దుర్ఘటనలో నాన్సీ చనిపోయింది. అప్పుడామెకు 37 సంవత్సరాలు. పదకొండు మంది పిల్లలు. భర్త విలియమ్ బార్నెట్ ఆమె చివరి కోరిక తీర్చాలని గట్టిగా అనుకున్నాడు.   ఆమెకెంతో ఇష్టమైన చిన్నపాటి కొండకు ఎదురుగా ఆమె అంతిమ సంస్కారాలు పూర్తిచేశాడు. ఇరుగు పొరుగు ఊరుకోరుగా. చిన్నపాటి సమాధి కట్టేయమని సలహా ఇచ్చారు. అదే చేశాడు విలియమ్. అయితే ఏళ్లు గడిచేకొద్దీ మార్పులు చోటు చేసుకుంటుంటాయి కదా. అలా నాన్సీ సమాధి కట్టిన ప్రాంతం వెడల్పు చేయాలనుకున్న రోడ్డు మధ్యకు వచ్చింది. స్థానిక ప్రభుత్వం సమాధిని తొలగించే ప్రయత్నం చేసింది. అయితే నాన్సీ సంతానం అందుకు ఊరుకోకుండా గట్టిగానే అడ్డుపడి సాధించింది. ఆ సమాధిని అలాగే వుంచేసి రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టారు. ఇప్పుడదో సందర్శనీయం స్థలం అనుకోండి.

పేరు.. ఇంటిపేరు..

వాడికి పిచ్చెక్కినట్లు తోచింది. బుర్ర బాదుకున్నాడు. జుట్టు పీకుకున్నాడు . మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న వేసుకున్నాడు. “నా పేరేంటీ ” ఆ ప్రశ్న దయ్యంగా వెంటాడింది అతన్ని. ఏమో ! ఇప్పటివరకు, అందరిలా తనకు కూడా ఒక పేరుందని అనుకునేవాడు. అందరూ అతన్ని “ఒరేయి పొట్టోడా” అని పిలిస్తారు. కాని అది అతని పేరు కాదట! అది ఇప్పుడే తలుసుకున్నాడు వాడు.

“మరి నా పేరు..” బుర్రలో కందిరీగలు ముసురుతున్నట్లు తోచింది అతనికి. అతని బుర్రలోని ఆలోచనల వేడి మిట్టమధ్యాహ్నపు ఎండగా రగిలింది. అప్పుడప్పుడు వాడు విడిచే నిట్టూర్పుల్లాంటి వేడి గాలి ... అపార్టుమెంటు ... చుట్టూ తచ్చాడింది. ఆ గాలికి కదిలే మొక్కలను చూస్తే ప్రతి మొక్కకి కూడా ఒక పేరుందనేది గుర్తు వచ్చింది వాడికి. అపార్టుమెంటులోవున్న ప్రతి సార్‌కి ఒక పేరుంది. పని మనిషికీ, పేపర్ వేసేవాడికీ, చివరికి చెత్త ఎత్తడానికి వచ్చేవాడికి, రోడ్డు ఊడ్చేవాడికి కూడా పేరుంది. ఇంటి పేరుంది . కానీ నాకు మాత్రం పేరు లేదేమిటి ? పొట్టోడంటే పేరు కాదట! ఇంటి పేరు లేదట ! కుంగిపోయాడు వాడు. నిజం చెప్పాలంటే మొన్న మొన్నటి వరకు ఈ సమస్య తలయెత్త లేదు అందరూ వాడ్ని “పొట్టోడా” అని పిలిస్తారు. కొందరు “ఏరా” అని కూడా పిలిస్తారు. వాడు పలుకుతాడు. మరీ దగ్గరగా మసిలే కొందరు వాచ్మన్ మిత్రులు “బండోడా” అని కూడా పిలిస్తారు. ఏం పిలిచినా వాడు పట్టించుకోడు. పలుకుతాడు. కాని ఆ రోజు వచ్చింది సమస్య “తన మూడేళ్ళ పిల్లాడ్ని బడిలో చేర్చడానికి తీసుకొని వెళ్ళాడు వాడు. పిల్లాడి పేరడిగారు మాస్టారు. వాడి పిల్లాడికి పేరుంది “వాడు పెట్టిన పేరే ” పేరు చెప్పాడు.

“ మరి నీ పేరు --?” మాస్టారు అడిగారు.

“పొట్టోడు” తడబడకుండా వెంటనే జవాబు చెప్పాడు వాడు.

“ నీ పేరు చెప్పు ” మాస్టారు అన్నారు

“ పేరా... నా పేరదే సార్ ”

“ కాదురా ” బల్ల మీదున్న పేపర్ మీద పెట్టిన కోతి బొమ్మను ఒక సారి తిప్పి మాస్టారు చెప్పారు “నిన్ను అందరూ అలాగే పిలుస్తారేమో-- కాని అది సరైన పేరు కాదు”

“నన్ను ఇలాగే పిలుస్తారు సార్ .... కొందరు ఏరా అని కూడా పిలుస్తారు సర్ ”

“అది కాదురా. మీ తల్లిదండ్రులు పెట్టిన పేరు ”

“ తెలియదు ”

“ పోని , ఇంటి పేరు ”

వాడికేం తెలుసు ! పెదవి విప్పలేదు. మాస్టారు అయోమయంలో పడ్డారు . అతనికి అడిగిన ప్రశ్నకి జవాబు తెలియని క్లాసు పిల్లాడి లా కనబడ్డాడు వాడు . ఒక నిమిషం ఆలోచించిన తరువాత మరో ప్రశ్న వేసాడు. “పోనీ మీ నాన్న పేరు చెప్పు”

“కన్నారావ్ ”

“చూసావా, మీ నాన్నలా నీకూ ఒక పేరుంటుందిరా. ఆ పేరు చెప్పు ”

వాడు బుర్ర గోక్కుంటూ అలాగే నిలబడ్డాడు.

“ఏ కన్నా రావ్ . మీ నాన్న ఇంటి పేరు ”



కాసేపు పోయాక అన్నాడు “ గురుతోచింది గురుతోచింది సర్, నా పేరు చిట్టి గారబ్బాయి ....”

“ అది కూడా పేరు కాదురా ” నవ్వుతూ అన్నారు మాస్టారు. దిక్కులు చూస్తూ నిలబడ్డాడు వాడు. చాలా చిన్నప్పుడు బడిలో మాస్టారు ఏదో పేరు తో పిలిచేవారనేది లీలగా గుర్తుంది వాడికి ...కాని నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గులుక రాయిలా ఆ పేరు కాల ప్రవాహంలో మనసునుంచి కొట్టుకుపోయింది.

“పోనీ పేరు తెలియకపోతే పోనీలే ...ఏదో ఒకటి రాద్దాం. నీ కులం ఏమిటో చెప్పు ”

“వాచ్మేన్ సర్ ”

పకపకా నవ్వాడు మాస్టారు. ఒక నిమిషం పోయాక అన్నారు “అది నువ్వు చేసే ఉద్యోగంరా ...కులం కాదు” ఆలోచనల్లో పడ్డాడు వాడు. పేరు లేకపోయినా సర్దు కోవచ్చు. కాని కులం తెలియని వీడు ఎలా బతుకుతున్నాడని ఆశ్చర్యబోయాడు మాస్టారు.

“బాగా ఆలోచించి చెప్పు...పిల్లాడి కులం రాయకుండా కుదరదు .... రాయాలంటే నీ కులం తెలియాలి”

“తమరు అలా సెప్తే నానేం సెప్పాలా? పిల్లని ఇచ్చినప్పుడు మా మామ ఇదే మాట సెప్పినారు సారు. మనమంతా వాచ్మేన్ కులమేనన్నారు సారు” బుర్ర గోక్కుంటూ అన్నాడు వాడు.

మాస్టారు బుర్ర పట్టుకున్నారు. ఎదురుగా నిలబడివున్నాడు వాడి పిల్లాడు. శుభ్రమైన దుస్తులు వేసుకున్న ఆ పిల్లాడ్ని చూస్తే ముచ్చట వేసింది మాస్టారుకి. స్కూలులో చేర్చుకోలేమని చెప్పి పంపడానికి మనస్కరించలేదు. మాటల్లో పెడితే కావలిసిన వివరాలు బయటికి వస్తాయేమోనని అనుకొని మళ్ళీ అడిగాడు.

“పోనీ, నీ ఊరు పేరు తెలుసా ?”

“ అదేమిటి సారు ... ఆ మాత్రం తెలియదు వీసాపట్నం” ఆ జవాబుతో మాస్టారికి అతని మీద కొంత జాలి కలిగింది.

“అది కాదురా. మీ ఊరు ...నువ్వు చిన్నప్పుడు ఉన్న ఊరు ”

“నా సిన్నప్పుడా సర్ ... గుర్తు లేదు సార్ ” మాస్టారు అసలు మాట్లాడలేక పోయారు.

బరువుగా అడుగులు వేసి నడిచి వెళ్ళాయి నిమిషాలు. కాసేపు పోయాక వాడి ముఖం వెలిగింది.

“గురుతు వచ్చింది సార్ ... పేరు పండు’

ఉత్సాహంగా అన్నాడు వాడు.

"పండు, కాయ... ఇవేమీ పేరులు కావురా "

"మా యమ్మ నన్ను పండూ అని పిలిచేది సారు " తల్లి గుర్తుకు రాగానే తుఫాన్ వానలా వర్షించాయి అతని కళ్ళు.

"పాపం అమ్మ ...ఎంత పని చేసేదో! ...మట్టీ తట్టలు మోసేది. బిల్డింగ్ల కాడా ... అలా మట్టి మోసి మోసి మట్టిలో కలిసిపోయింది సారు" గట్టిగా నిట్టూర్చాడు వాడు...కళ్ళు వత్తుకున్నాడు.

"పేరు అడిగితే ఏడుస్తావేంట్రా...తెలిస్తే చెప్పు ...లేకపోతే పిల్లాడ్ని తీస్కోని వెళ్ళిపో "

"అమ్మ గురుతోచ్చింది సార్ ... నా సిన్నప్పుడు అమ్మ సీదేవిలా ఉంటేది సార్. అపార్ట్మెంటులోని అమ్మగార్ల కన్నా బాగుండేది సారు. మెడలో గొలుసులుండేవి. చేతికి గాజులు కూడా. పండు అని పిలిస్తూ ముద్దాడేది సర్"

మాస్టారు ఏం మాట్లాడలేదు. చక్కగా చలాకీగా వున్నాడు వాడి కొడుకు. వాడ్ని ఎలా బడిలో చేర్చుకోవాలనే ఆలోచనలో పడ్డాడు అతడు.

"పోనీ, మీ నాన్న ఏం చేసేవాడురా?"

"వ్యవసాయం చేసేవారట సారు. అమ్మ సెప్పి ఏడ్చేది. బోల్డు మంది పని చేసేవారట ఆయన కాడ. పంచకట్టుతో అచ్చం శోభన్ బాబులా ఉంటేవాడట సారు "

మాస్టారు మాట్లాడలేదు. ఒక నిమిషం పోయాక వాడు మళ్ళీ చెప్పాడు. "అది నా సాల సిన్నప్పటి కబురులు సార్ ... అప్పుడు నాకేదో పేరు పెట్టారట, సారు " వాడు మళ్ళీ బుర్ర గోక్కున్నాడు.

ఒక నిమిషం పోయాక వాడు అన్నాడు. "ఒక పొద్దు ఎవ్వరెవ్వరో దొరలు వచ్చారు సార్ " అయ్యతో మాట్లాడారు .. ఆ పొద్దు బాగా ఏడ్చాడట అయ్య ...అమ్మ కూడా ఏడ్చినాదట. మరో నాల్గు రోజులకు అయ్య ఎక్కడకో వెళ్లిపోయాడట. తరువాత అయ్య కనబడలేదట సారు. ఒక ఆరు నెలలు పోయాక మా ఇల్లూ భూమీ రోడ్డై పోయిందట. అప్పుడు నేను సాలా సిన్నోడినట. పని కోసం పట్నం వచ్చిందట అమ్మ. ఇప్పుడు మా అమ్మ కూడా లేదు సార్, నా పేరు అడుగుదామంటే " వాడి కళ్ళు చమర్చాయి.

మాస్టారికి కూడా బాధ కలిగింది. వాడి ఎదుట కళ్ళు వొత్తుకోవటం ఇష్టం లేక లేచి కిటికీ దగ్గరకి వెళ్ళారు. కిటికీ అవతల పెను వానకి నేలకి ఒరిగిన చెట్ల అవశేషాలు. వాటినుంచి లేచిన పుట్ట గొడుగులు!

"తండ్రి, తన పేరు, కులమూ చెప్పకపోతే బడిలో చేర్చుకోలేమయ్యా" చివరికి బాధగా అన్నారు, మాస్టారు.బరువుగా అడుగులు వేసాడు వాడు అపార్టుమెంట్ వైపు. "గుర్రం నా పేరేమిటీ ..." అపార్టుమెంటు చేరగానే పెళ్లాన్ని అడిగాడు.

"ఆ మాట నేనడగాలా. నాకేం ఎరుక. నీ పేరేమిటో నువ్వే సెప్పాలా" బుర్ర దించుకుని కూర్చున్నాడు వాడు.

"అసలు మా అయ్యని అనాలా. ఊరూ పేరూ తెలియని వాడికిచ్చి మనువు చేసినాడు ..." నిష్టూరమాడింది వాడి పెళ్ళాం.

నిజమే !వాడి మామ అదే గుర్రం తండ్రి-- ఆ విషయాల గురించి పట్టించుకోలేదు.

"నువ్వు నాకు నచ్చావురా" అతడు అన్నాడు. "నీ పేరుతో నాకేం పనిరా ... అందరూ నిన్ను పొట్టోడా అని పిలుస్తున్నారుగా. నేనూ పొట్టోడా అనే పిలిస్తాను. నువ్వు నా కూతురిని పోషించగలవు .. చాలు, పేరు లేకపోయినా ఫర్వాలేదులే. అదే పని చేసుకొని పోషించుకుందువులే. దానికి ఒక మగ తోడు కావాలి కదా. నీకు ఒక ఆడతోడు కూడా ... చాలా సుళువుగా తేల్చేసాడు అతడు. అలా పెళ్లి జరిగిపోయింది... జీవితం సాగుతోంది. కాని ఇప్పుడు...కాని ఇప్పుడు. ఇప్పుడు ఏం చెయ్యాలి.. సతమతమయ్యాడు వాడు. మెరుపులా ఒక ఆలోచన వచ్చింది వాడికి ...అపార్ట్మెంటు నెంబర్ సారుని అడుగుతే ..."ఆ సారు చెప్పారుగా మాదీ మీ ఉరేనని .. అడుగుతే ... ఊరూ పేరూ చెబుతారేమో ...సారు మరిచిపోరు కదా ..."

కాని వాడికి ధైర్యం చాలలేదు .. ఆ సార్ ...అదే యెల్లయ్య ...వాడితో ఎప్పూడూ మాట్లాడడు ...వాడు ఏం చెప్పినా విననట్లు వెళ్ళిపోతాడు. అంతే కాదు నల్లకళ్ళద్దాలతో పదిమందితో పెద్ద కారులో దిగి అపార్టుమెంటుకు వెళ్ళే అతనితో మాట్లాడాలంటేనే వాడికి భయం !

కాని అతనికి చాలా విషయాలు తెలుసట! పెద్ద పెద్ద ఆఫీసర్లనూ రాజకీయ నాయకులు కూడా తెలుసట! అందరూ అనుకొంటుండగా విన్నాడు వాడు.అతనికి తన పేరు తెలియకుండా వుంటుందా అని అనుకున్నాడు వాడు. ధైర్యం సంతరించుకొని వెళ్ళి బెల్లు కొట్టాడు .. అతడే తలుపు తీసాడు ...అతని వజ్రపు ఉంగరాల నుండి వచ్చిన వెలుగు వాడి ముఖాన్ని తాకింది.

"ఏరా –?"

"సార్ , నా పేరు "

"పొట్టోడు , ఏరా నీ పేరు మరిచిపోయావా ?"

"అది కాదు సార్ ,మా నాన్న పెట్టిన పేరు "

"నాకెలా తెలుస్తుందిరా ..."

"మీదీ మా ఊరేనని చెప్పారు కదా సార్ --?"

తను అంత ధైర్యంగా ఎలా మాట్లాడుతున్నాడని అతనికే అర్థం కాలేదు.

"ఓ ...అందువల్ల అడుగుతున్నావా ... అయినా నీకు ఇప్పుడు పేరుతో పనేం ఉందిరా" బడిలో జరిగినది చెప్పాడు వాడు .

"మీ నాన్న పేరేమన్నావు?"

"కన్నారావు" ఆలోచనలో పడ్డాడు వాడు.

ఆ తరువాత లోపలకి వెళ్ళి ఒక పాత ఫోటోతో వచ్చాడు."ఒరే! మన ఊరికి సంబంధించిన ఒకే ఒక ఫోటో ఇది ...ఈ ఫోటోలో నీకు గుర్తున్నవాళ్లు ఎవ్వరైనా ఉన్నారా చూడు"

ఫోటో చూసిన అతని గుండె పున్నమి నాటి సముద్రంగా మారింది . "ఇతనే , తనే మా నాన్న సార్" ఒక ఫోటో చూపిస్తూ అన్నాడు వాడు. యెల్లయ్య గుండె గతుక్కుమంది.

"అంటే, వీడు, వీడు ఆ కన్నారావు కొడుకా!" యెల్లయ్య ఆశ్చర్యపోయాడు.

ఆ కన్నారావు అతనికి గుర్తే ... చిన్నప్పుడు చాలా సార్లు తండ్రితో పాటు కన్నారావు ఇంటికి వెళ్ళాడు కూడా . కన్నారావు ఊరి పెద్ద ...అతని నాన్న కన్నారావు కోసం పాదరక్షలు కుట్టి ఇంటికి తీసుకొని వెళ్ళి ఇచ్చేవాడు. అలా ఒక సారి వెళ్ళినప్పుడు కన్నారావు చెప్పిన మాటలు కూడా గుర్తున్నాయి యెల్లయ్యకి.

"ఒరేయ్, పిల్లాడ్ని చదివించు. పదో పరకో కావాలంటే సందేహించకు ... అడుగు ... ఇస్తాను"

"ధర్మ ప్రభువురా" అతని తండ్రి ఒక సారి అన్నాడు "ఆ అయ్య డబ్బులు కట్టకపోతే నువ్వు ఎలా చదివేవాడురా. నాలా చెప్పులు కుడుతూ తల ఎత్తక కూర్చునేవాడివి ... నువ్వే పాడు చేసుకున్నావు "

నిజమే! పట్నంలో కాలేజీలో చేరాక యెల్లయ్య దృష్టి మళ్ళిపోయింది. చదువు మీద శ్రద్ధ తగ్గింది రాజకీయాల్లో చేరి ... నాయకుడయ్యాడు...నాల్గు వేళ్లకూ వజ్రపు ఉంగరాలు తొడుక్కున్నాడు. ఇప్పుడు కన్నారావు కొడుకు వచ్చాడు. పేరడుగుతున్నాడు. ఇంటి పేరడుగుతున్నాడు! ఏం చెబుతాడు? వాడి పేరూ ఇంటిపేరూ అతడూ మరిచిపోయాడు. గుర్తు తెచ్చుకొని చెప్పాలా... చెబితే...

"సార్ నా పేరు" వాడు మళ్ళీ అడిగాడు.

యెల్లయ్య ఏం పలకలేదు . కాసేపు అలాగే నిలబడ్డాడు వాడు. ఆ తరువాత విసురుగా సెల్లార్ లోకి వచ్చాడు . పేరూ...ఇంటి పేరు... కోల్పోయి తన ఉనికిని కోల్పోయిన వాడు సెల్లార్‌లో చతికిలబడ్డాడు. తన మీద కళ్ళు యెర్రచెసిన సూర్యుడ్ని చూడలేక ముఖం తిప్పుకున్నాడు అప్పుడు అతనికి కనబడినది అపార్టుమెంటులోని చెత్త కుండీ వైపు తదేకంగా చూస్తూ చుట్టూ కదిలే ఒక కాకి మాత్రమే !

- ఎల్. ఆర్. స్వామి

నవ్వుల్ – పువ్వుల్

రహస్యం

(రమేష్ ఈ మెయిల్ చేయడాన్ని రహస్యంగా చూస్తున్న వెంగయ్య)
నీ ఈమెయిల్ పాస్‌వర్డ్ నాకు తెలిసిపోయింది
ఔనా ఏంటో చెప్పు కంగారుగా అడిగాడు రమేష్
అయిదు స్టార్లు చెప్పాడు వెంగళయ్య

వాసన!

రాధ: హల్వా ఎలా ఉంది?
రవి: నీకు ప్రతిదీ శుభ్రంగా ఉంచడం అలవాటు కదా?
రాధ: మీకెలా తెలుసు ?
రవి: ఏం లేదు... హల్వా వాసన కన్నా విమ్ సబ్బు వాసన ఎక్కువగా వస్తూంటే!

రోగినే..!

రోగి: రెండు రోజులుగా భోజనం చెయ్యలేదండి..!
డాక్టర్: పక్కకి వెళ్ళండి..ఇది క్లినిక్.!
రోగి: అరే..నేను బిచ్చగాడిని కాదు డాక్టర్.ఆకలి కలగటం లేదని మీ దగ్గరకొచ్చాను..!

పిచ్చి కుక్క

డాక్టర్: కుక్క వెంటపడుతుంటే తప్పించుకోకుండా ఏం చేస్తున్నారు?
పెషెంట్: హచ్‌కుక్కేమో అనుకున్నా కరిచాక తెలిసింది పిచ్చికుక్క అని.

హారన్

ఒకతను కారులో పోతున్నాడు ఇంతలో కారుకి కుదుపు వచ్చింది
యజమాని: ఏంటీ! ఏమయిందీ!
డ్రైవర్: బండరాయి అడ్డువచ్చిందండి
యజమాని: హారన్ మోగించలేకపోయవా?

సున్నాలు



టీచర్: అన్నింటిలోనూ గుడ్డు సున్నాలు వస్తున్నాయి. మీ నాన్న గారేం చేస్తుంటారోయ్..?
రాము : గుడ్ల వ్యాపారం చేస్తుంటారు మేడం

నిలబడే ..!



ఉపాధ్యాయుడు: మీ పరిస్థితేం బాగాలేదు. ప్యాసమ్యేటట్టు లేరు..! మిమ్మల్ని పరీక్షలకు కూర్చోబెట్టనురా..!
విద్యార్థులు: మీరు కూర్చోబెట్టొద్దు సార్..! మేము నించునే రాస్తాము..!

మేకప్ చేయలేనా..!

హీరో: నా దగ్గర మేకప్‌మెన్‌గా పని చేస్తానంటున్నావు అనుభవం ఉందా..?
పేరయ్య: ఉందండి సారూ.. గత పదిహేనేళ్ళుగా తాపీమేస్త్రీగా పని చేస్తున్నా..!

ఉంగరం ఉందేమో

ఏంటీ నాకు మళ్లీ ఆపరేషన్ చెయ్యాలా? నిన్ననే ఆపరేషన్ సక్సెస్ అన్నారు గా? భయంగా అడిగాడు పేషెంట్
ఆపరేషన్ చేసినప్పటి నుంచి మా డాక్టర్ గారి ఉంగరం కనిపించడంలేదు. మీ పొట్టలో ఉండిపోయిందేమోనని తాపీగా చెప్పాడు కంపౌడర్

ఎక్కను..

వీరేశం: నువ్వు ఎప్పుడూ విమానమెక్కలేదా?
వెంగళప్ప: ఎక్కలేదు... ఎక్కనుకూడా
వీరేశం: ఏం ఎందుకు..పడిపోతుందనా?
వెంగళప్ప: విమానం ఎక్కేటపుడు పెద్దగా విశాలంగా ఉంటుంది. ఆకాశంలోకి ఎగిరాక చిన్నగా అయిపోతుంది. అప్పుడు ఇరుకుగా కూర్చోలేక నలిగి పోతాం కదా..

గురజాడ అప్పారావు శత వర్ధంతి జరుగుతున్న ఈ సంవత్సరం ఆయన 'కన్యాశుల్కం' సినిమా వజ్రోత్సవ సంవత్సరం కూడా కావడం చారిత్రిక విశేషం. మొదటి సారి కన్నా తర్వాతి పర్యాయాలు విడుదలైనప్పుడు ఎక్కువ విజయం సాధించిన కొద్ది చిత్రాల్లో 'కన్యాశుల్కం' ఒకటి. ఇప్పటిలా టీవీలు, వీడియోలు లేని రోజుల్లో చిత్రాలు మళ్లీ మళ్లీ విడుదల కావడం సర్వసాధారణం. ఆ విధంగా థియేటర్లకు కొన్ని పాత విజయవంతమైన చిత్రాలు ఫలానా థియేటర్లో ఏడాదికో రెండేళ్లకో మళ్లీ వస్తాయని (రిపీట్ రన్) అందరికి తెలిసిపోయేది. అందులోనూ అగ్ర హీరోల సంస్థల చిత్రాలకు ఆ విధమైన ఏర్పాటు కూడా వుండేది. 'పాతాళ భైరవి' ఏదో ఒక థియేటర్లో ఎక్కడో ఒక చోట ఆడుతుంటుది గనక ఇప్పటికి యాభై ఏళ్లు పూర్తి చేసుకున్నట్టు లెక్క అని ఒకసారి చక్రపాణి చమత్కరించారందుకే. అయితే 'కన్యాశుల్కం' సంగతి వేరు. 1955లో మొదటి సారి విడుదలైనప్పుడు అంతగా ఆదరణ పొందని ఆ సినిమా దశాబ్దాల తర్వాత శత దినోత్సవాలు చేసుకోవడం చాలా అరుదైన ఉదాహరణే. ప్రేక్షకులు ఆచిత్రం స్వారస్యాన్ని, గురజాడ నాటకంగా దాని విశిష్టతను ఆలస్యంగా అర్థం చేసుకోవడం ఇందుకు కారణమై వుండొచ్చు. కన్యాశుల్కం చదవడానికే తప్ప ప్రదర్శనకు అంతగా అనుగుణం కాదనే అపప్రథ చలన చిత్రానికి లేకుండా పోయింది. మూడు గంటల నిడివి కోసం నాటకాన్ని సంక్షిప్తపర్చి కొన్ని మార్పులు చేశారు.

అరవయ్యేళ్ల అపురూప చిత్రం కన్యాశుల్కం

- తెలకపల్లి రవి

తెలుగు సినిమాలే గాక భారతీయ భాషా చిత్రాలు అనేకం పౌరాణిక నాటకాల పునర్ నిర్మాణాలుగానే మొదలైనాయి. తొలి మూకీ చిత్రం రాజా హరిశ్చంద్ర, భక్త ప్రహ్లాద, కథలన్నీ ఆ కోవ లోవే! తర్వాత పాతాళభైరవి, మాయా బజార్, రాజా విక్రమార్క వంటివన్నీ కూడా దేశ విదేశీ పురాణ జానపద కథలను చిత్రాలుగా మలిచి తీసినవి. అయితే జయప్రదమైన సాంఘిక నాటకాలను చిత్రాలుగా తీయడం పెద్దగా జరగలేదు. సినిమాలను చూసి రాసిన నాటకాలు పల్లెల్లో అడటమే తప్ప అటు నుంచి ఇటు వచ్చింది తక్కువ.

'కన్యాశుల్కం' సినిమాగా తీయాలని వినోదా వారు ప్రకటించినప్పుడు ముందే పెద్ద చర్చ జరిగింది. అది సినిమా

ఎన్టీఆర్, సావిత్రి

ఫార్ములాకు సరిపోదన్నారు. ఆ స్థాయిలో తీయలేరన్నారు. 'దేవదాసు'తో చిరపరిచితమైన వినోదా సంస్థ అధినేత డి.ఎల్. నారాయణకు ప్రసిద్ధ నవలలు నాటకాలంటే చాలా ఆసక్తి. 'కన్యాశుల్కం' అనుకున్నప్పుడు కూడా డిఎల్ మొదట అక్కినేనినే సంప్రదించారు. ఆయన నిరాకరించిన తర్వాత దర్శకుడు పి.పుల్లయ్య ఎన్టీఆర్‌ను ఎంపిక చేశారు.(ఆ తర్వాత కాలంలో 'ఏకవీర' చిత్రానికి కూడా అక్కినేని నిరాకరించారు) మధురవాణిగా సావిత్రిని తీసుకున్నారు. రామప్పంతులుగా సిఎస్ఆర్‌నూ, లుబ్ధావధాన్లుగా గోవిందరాజుల సుబ్బారావును, అగ్నిహెూత్రావధాన్లుగా విన్నకోట రామన్న పంతులునూ ఎంపిక చేశారు. బుచ్చమ్మగా జానకి, ఆమె తల్లి వెంకమ్మగా హేమలత, పూటకూళ్లమ్మగా చాయాదేవి, లుబ్ధావధాన్లు కూతురు మీనాక్షిగా సూర్యకాంతం, తదితరులు నటించారు. నటీనటులుందరూ హేమాహేమీలైనా పాత్రలే కనిపిస్తాయి. చాందస బ్రాహ్మణ పాత్రలను చూసిన అప్పటి పిల్లలు తమ వీధుల్లో కనిపించే అయ్యవార్లే నటించారనుకున్నారట!

అప్పటికే సాంఘిక పౌరాణిక జానపద చారిత్రిక పాత్రలతో అలరించిన ఎన్టీఆర్ ప్రతినాయక ఛాయలున్న గిరీశం పాత్రను ఒప్పుకోవడమే ఒక సాహసం. ఆ పాత్రతో సహా ఏది ఎలా వుండాలో కళా దర్శకుడు వాలి స్కెచ్‌లు తయారు చేశారు. ఎన్టీఆర్‌కు గిరీశం పాత్ర బాగా నప్పింది. వంకర చూపుతో వంచనాత్మక మాటలతో అవతలి వారిని బురిడీ కొట్టించే తీరు

ఆయన బాగా పండించారు. మధురవాణి దగ్గర తన ఆటలు సాగనప్పుడు, ఆమె దగ్గర వుండగానే పూటకూళ్లమ్మ చీపురు కట్టతో తరుముకొచ్చినప్పుడు అన్నిటినీ మించి బుచ్చమ్మను వలలో వేసుకోవడానికి గాను 'వదిన గారూ! ఎంత మాటన్నారు?!' అంటూ వెంటపడినప్పుడు ఎన్టీఆర్ ఒక పెద్ద హీరోగా గాక టక్కరిగానే కనిపించారు. 'చిటారు కొమ్మన మిఠాయి పొట్లం చేతికందదేం గురుడా' అన్న పాట, దానికి అభినయం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వన్స్ దేర్ లివ్డ్ ఎ కింగ్ అంటూ శిష్యుడు వెంకటేశంతో ఉత్తుత్తి ఇంగ్లీషు మాట్లాడ్డం, లేనిపోని కోతలు కోయడం, తెలియని శాస్త్రాలు ఉటంకించడం , 'ఏంటాయ్ షేక్స్పియర్ మొహం పెట్టావ్' అంటూ పలకరించడం, 'మై హార్ట్ మెల్ట్స్' అంటూ బుచ్చమ్మ దగ్గర అభినయం అన్నీ నచ్చుతాయి.

గోవిందరాజుల సుబ్బారావు, సావిత్రి

సావిత్రి మధురవాణి పాత్ర కోసమే పుట్టినంత సహజంగా చేసింది. పార్వతి వంటి బరువైన పాత్రలు, కుటుంబ కథల గృహిణి పాత్రలు ప్రధానంగా చేసిన సావిత్రి మధురవాణి పాత్రను ఒప్పుకోవడంలో ఆమె అభిరుచి వెల్లడవుతుంది. తర్వాత ఆమె పాత్రను చాలా అధ్యయనం చేసింది. చాలామందితో చర్చించింది. రామప్పంతులు 'లొట్టిపిట్టలు తెప్పిస్తా'నంటే పడీ పడీ నవ్విన సన్నివేశం గాని, లుబ్ధావధాన్ల పిలకను తీసి ఆడదిక్కులేక బావగారు ఇలా అయిపోయారని ఏడిపించడం గాని ఎక్కడైనా సరే నటనలో సంభాషణల్లో ఆమెకు ఆమే సాటి అనిపిస్తుంది. అందరినీ తిప్పలు పెట్టే గిరీశం, రామప్పంతులు వంటివారినే మధురవాణి ఒక ఆట ఆడిస్తుంటే ప్రేక్షకులు కేరింతలు కొట్టేవాళ్లు. ఇక శకుని వంటి పాత్రలకే ప్రాణం పోసిన సిఎస్ఆర్కు రామప్పంతులు పెద్ద లెక్కలోది కాదు. డాంబికం, దబాయింపు, నక్కజిత్తులు మేళవించి అమోఘంగా పండించారు. విజయవాడలో న్యాయవాదిగా వున్న విన్నకోట రామన్నపంతులు అగ్నిహోత్రావధాన్ల పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేశారు. 'తాంబూలాలిచ్చాను తన్నుకు చావండి' వంటి ప్రసిద్ధ సంభాషణలు కూడా గొప్పగా పలికించారు. మహానటుడు గోవిందరాజుల సుబ్బారావుకు అందరికన్నా అధికంగా మార్కులు పడతాయి. కాటికి కాళ్లు చాచుకుని కూడా చిన్నపిల్లను అది కూడా తక్కువ కన్యాశుల్కంతో పెళ్లి చేసుకోవాలనుకున్న ఆయన దురాశ దాన్ని ఉపయోగించుకుని ముప్పుతిప్పలు పెట్టే రామప్పంతులు, మధురవాణి సహాయంతో శిష్యుడికి అమ్మాయి వేషం వేసి మోసం చేసే కరకటశాస్త్రి (వంగర) చెప్పాలంటే ప్రతి ఘట్టం వినోదాన్ని సందేశాన్ని ఏకకాలంలో పండిస్తాయి.

చిత్రంలో దర్శకుడు సమయానుకూలంగా పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కథను తెరపై ఆవిష్కరింపచేశారు. అలాగే శ్రీశ్రీ రాసిన 'ఆనందం ఆర్ణవమైతే పాటకు నృత్యం పెట్టారు. మల్లాది రామకృష్ణ శాస్త్రి రాసిన 'చిటారు కొమ్మన' పాట మొత్తం గిరీశం స్వభావానికి తగినట్టు సాగుతుంది. ఈ పాటతో పాటు పూర్ణమ్మ కథను ఘంటసాల (సంగీతమూ ఆయనదే) అద్భుతంగా గానం చేశారు. నాటక రంగంలో గిరీశం పాత్ర పట్ల వున్న అపరిమిత అంచనాల కారణంగా కొంతమంది ప్రముఖులు ఎన్టీఆర్ను అంతగా ఆమోదించలేకపోయారు. సంస్కర్త సౌజన్యారావు (గుమ్మడి) చివరలో బుచ్చమ్మకూ గిరీశానికి పెళ్లి చేసినట్టు చూపించడం కూడా శ్రీశ్రీ, కొడవటిగంటి తదితరుల విమర్శకు గురైంది. గిరీశం 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అంటూ నిష్క్రమించడం గాక బుచ్చమ్మను పెళ్లి చేసుకున్నట్టు చూపించడంవల్ల గురజాడ ఉద్దేశమే తలకిందులైందని భావించారు. చిత్ర కథ సుఖాంతం చేసినప్పటికీ దానికి ఒక కారణం పెట్టారు. గిరీశం వంటి టక్కరిని దేశం మీద వదలిపెట్టే బదులు బుచ్చమ్మతో పెళ్లిచేస్తే కొంతైనా బాగుపడతాడేమోనని మధురవాణి చెప్పిన సలహా సౌజన్యారావు పాటించినట్టు చూపించారు. వెనక్కు తిరిగి చూసుకుంటే అరవై ఏళ్ల కిందట తీసి వుండకపోతే తర్వాత మరెవరూ ఆ మాత్రం తీసి వుండేవారు కాదేమో. ఎందుకంటే ప్రసిద్ధ తెలుగు సాంఘిక నాటకాలు చిత్రాలుగా వచ్చింది చాలా తక్కువ. ఆ ఘనత కూడా 'కన్యాశుల్కం'కే దక్కింది.

ఎన్టీఆర్, షావుకారు జానకి

ఈ చిత్రం ఇంత బాగా రావడానికి కారణం దర్శకుడు పుల్లయ్య. నలభైలలోనే మంచి పేరు తెచ్చుకున్న పుల్లయ్య ఎన్నో కళాఖండాలను పండించిన వ్యక్తి. తర్వాత తనూ నిర్మాతగా అనేక మంచి చిత్రాలందించారు. తొలుత సరిగ్గా ఆడని 'కన్యాశుల్కం' 30 ఏళ్ల తర్వాత విడుదలైనప్పు శతదినోత్సవాలు జరుపుకోవడం ఒక విశేషం. జయాపజయాలు విమర్శలు ఎలా వున్నా ఆ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో గురజాడ అడుగుజాడగా మిగిలిపోయింది.

✦

◆ ప్రత్యేకం

ఆ గ్రామం గంగను జయించింది

మనయాలి! మహారాష్ట్రలోని ఓ మారుమూల పల్లె. మూడేళ్ల కిందట నీటికి కటకటగా వుండేది. తాగునీటి కోసమే కాదు. వాడుక నీటికోసమూ మైళ్లకు మైళ్లు నడిచిపోవాల్సి వచ్చేది. ఆడవాళ్లు, పిల్లలకు నీటిని తెచ్చుకోవడమే పెద్ద పనిగా వుండేది. అలాంటి గ్రామం ఇవాళ నీళ్ల సమస్యను అధిగమించింది. పైపుల్లో నీరు అందుతుండడంతో గ్రామీణుల్లో ...మరీ ముఖ్యంగా మహిళల మోముల్లో చిరునవ్వులు నాట్యమాడుతున్నాయి. ఇంతకీ ఆ విజయం ఎలా సాధ్యమైంది?!

మనయాలి గ్రామం మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాలో వుంటుంది. పెన్‌గంగ వన్యప్రాణుల అభయారణ్యానికి చాలా దగ్గర. నీటి కరువు గురించి మాటల్లో చెప్పలేం. వర్షపాతం తక్కువ. రైతుల ఆత్మహత్యలు ఎక్కువ. వేసవిలో నీటి కోసం మహిళలు బిందెలు తీసుకుని సుదూర తీరాలకు నడిచివెళ్లాల్సిందే. చిన్నారులను కూడా ఇందుకోసం పనిలో పెట్టుకునేవారు. ఇక వారి సమయంలో అధికశాతం నీళ్లను చేరవేయడానికే ఖర్చయ్యేది. గ్రామంలో సంప్రదాయ బావులు వున్నప్పటికీ వాటిని సక్రమంగా వాడకపోవడం వల్ల బావి నీటి నాణ్యత అంతకంతకు క్షీణించిపోయింది. ఇక గ్రామ పంచాయతీ కలుగచేసుకొని ఒక్కసారిగా బావుల్లో నీటిని పెద్దమొత్తంలో తోడుకోకుండా అడ్డుకోవాల్సి వచ్చేది. కేవలం తాగునీటికి రేషన్ పద్ధతిలో మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిచ్చేది. అవి ఏ ఒక్క అవసరాన్నీ పూర్తిగా తీర్చగలిగేవి కావు. అరకొరగా అందేవి నీళ్లు.

సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో సంతోష్ గవాలె గ్రామంలోకి అడుగెట్టాడు. ఇతను గ్రామీణ్ నిర్మాణ్ ప్రాజక్టులో పనిచేసేవాడు. అతనికి నీటి సరఫరా, పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం... వంటి గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలమీద బాగా ఆసక్తి వుండేది. దాంతో గ్రామంలో తిష్టవేసిన నీటి సమస్య అతన్ని ఆకట్టుకుంది. దాన్నుంచి గ్రామాన్ని ఎలాగైనా బైటపడేయాలనుకున్నాడు. వాస్తవానికి ఊళ్లో కూడా చాలా మంది మనసుల్లో ఇదే వుంది. సమావేశాల్లో అందరూ నీటి సమస్యను అధిగమించాల్సిందేనన్నారు. అయితే అందుకు గ్రామస్తులంతా పనిచేయాల్సి వుంటుందన్నాడు సంతోష్. అతను చెప్పిన లెక్కలు కూడా అందర్నీ అంగీరించేలా చేశాయి. “గృహావసరాలకు కావాల్సిన నీటి కోసం రోజుకు 4 గంటలు ... నెలకు 120 గంటలు...ఏడాదికి 60 రోజులు కేటాయిస్తున్నాం. దానికి బదులుగా ప్రతి కుటుంబం 8 నుంచి 10 రోజులపాటు బావి తవ్వే పనిలో వుంటే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది” అన్నాడతను. ఈ లెక్కలు వారి మనసుల్లో బాగా పనిచేశాయి. బావి తవ్వడానికి ముందుకొచ్చారు.

అయితే ఎక్కడైతే తవావ్వలనుకున్నారో ఆ రైతు మొండికేశాడు తన భూమిని ఇవ్వనని. దాంతో గ్రామస్తులు మొండిగా... అతని ఇంటి ముందు ప్రదర్శనగా కూర్చునేసరికి ... ఎట్టకేలకు దిగిరావాల్సి వచ్చింది. మొదట్లో మహిళలు మాత్రమే బావి పనిలో పాల్గొన్నారు. మెల్లగా వారి కటుంబ సభ్యులూ రంగంలోకి దిగారు. మొత్తం గ్రామం ఒంటి తాటి మీద నిలబడి పట్టుదలతో 30 అడుగుల బావిని నిర్మించింది. ఇది జరిగింది 2011లో. ఇందుకు నిర్మాణ్‌తో పాటు, రేగా, తదితర పథకాల సొమ్మును ఖర్చు చేశారు. పైపులు ఏర్పాటు చేయడానికి ఒక్కో కుటుంబం నుంచి వెయ్యి రూపాయలు సేకరించారు. ప్రస్తుతం పైపుల ద్వారా ఆ బావి నుంచి

గ్రామస్తులందరికీ సమానంగా నీరు అందుతోంది. నీటి పంపిణీ బావుల పర్యవేక్షణ వంటి పనులను పర్యవేక్షించడానికి గౌరవ వేతనంతో పనిచేసే ఉద్యోగులూ వున్నారు. నీటి సమస్య తీరడంతో మహిళలకు ఎర్రటి ఎండల్లో దూర ప్రయాణాలు చేసి నీటిని మోసుకొచ్చుకునే బాధ తప్పింది. మరి సొంత ఊళ్లోనే గంగమ్మ కొలువు తీరితే బిందెల మోత అవసరమేముంటుంది!! ✦

◆ సందర్భం

చరిత్రగా మారిన చిత్రకారుడు



పాబ్లో పికాసో! ఈ పేరు తల్చుకోగానే ఆధునిక చిత్రకళ కళ్ల ముందు నిలిచినట్టవుతుంది. సామాన్యుడికి స్పష్టమైన రంగు రంగుల చిత్రాలు అలా అలా తిరిగిపోతుంటాయి. వందల కోట్ల విలువైన బొమ్మల అమ్మకాల వార్తలు గుర్తుకు వస్తాయి. ఆధునిక జీవనరీతికి ప్రతీకగా మిగిలిన ఒక అంతర్జాతీయ కళాకారుడు సాక్షాత్కరిస్తాడు. ఎందుకంటే చిత్రకళా చరిత్రలో పికాసో ఒక అధ్యాయం అంటే చాలదు- ఆయనే ఒక చరిత్ర. కొత్త చరిత్రకు నాంది.

-పీపీ

'నేను సైనికుడినైతే సైన్యాధిపతినవుతాననీ, మతాధికారినైతే పోప్‌గా ఎదుగుతానని మా అమ్మ అంటుండేది. అయితే నేను బొమ్మలు గీయడం మొదలు పెట్టి పికాసోగా మిగిలాను' అంటుండేవాడాయన. ఆయన పేరు చాంతాడంత పొడవుంటుంది. తండ్రి బ్యాస్ రిజు బ్యాగో కూడా చిత్రకారుడు, చిత్రకళా ఉపాధ్యాయుడు. పికాసో పుట్టినప్పుడు మామూలుగా ఏడవకుండా పిజ్ పిజ్ అన్నాడంటారు. స్పానిష్ భాషలో పెన్సిల్‌ను లాపిజ్ అంటారు. ఇది కథే కావచ్చు గాని పికాసో స్వభావాన్ని చెబుతుంది. అతనిలోని తపనను గమనించిన తండ్రి కూడా బాల్యంలోనే శిక్షణ ఇచ్చాడు. 13వ ఏడు వచ్చే సరికి అతను నాన్నను మించిపోయాడు. సరిగ్గా చదువుకోలేదు గాని అన్నిటినీ లోతుగా పరిశీలిస్తూ గీస్తూ వుండేవాడు. బాగా చదవడం లేదని ఆనాటి పద్ధతుల ప్రకారం ఒక ఒంటరి గదిలో పెడితే అక్కడ వున్న తెల్లటి గోడలను కాన్వాసుగా చేసుకున్నాడు. తర్వాత చిత్రకళాశాలలోనే చేరాడు గాని ఆ నియమ నిబంధనలు వగైరాల మధ్య అతనికి వూపిరాడలేదు. 1899లో ప్రతిష్టాత్మకమైన రాయల్ ఎకాడమీలో చేరాడు. కళతో పాటు అభ్యుదయ భావాలూ వంటపట్టించుకున్నాడు. అరాచకవాదుల ప్రభావం కూడా కొంత పడింది. ఇన్నిటి మధ్యనా అతని చిత్రకళ కొత్తపుంతలు తొక్కుతూనే వుంది. స్పెయిన్ నుంచి ఆయన పారిస్ వెళ్లాడు.

పికాసో చిత్రాలను రెండు దశలుగా విభజించారు. ఒకటి 1901-04 మధ్య కాలపు నీలి దశ (బ్లూ పీరియడ్). ఈ దశలో గీసిన చిత్రాలు జీవితంలో దైన్యాన్ని విషాదాన్ని చిత్రిస్తాయి. నిరాశనూ వైముఖ్యాన్ని కనపర్చేలా వుంటాయి. నీలి రంగును అందుకు ప్రతీకగా తీసుకుని అన్ని చిత్రాల్లోనూ దాన్నే అధికంగా వాడాడు. 1904-1906 మధ్య కాలం 'గులాబి దశ'. 1907లో వేసిన ఫైవ్ న్యూడ్స్ చిత్రం ఒక సంచలనమైంది. దానిపేరు 'లే డెమిసిల్లిస్ డి ఆవగాన్'. అయిదుగురు వేశ్యలను తనదైన శైలిలో చిత్రించి వారి మొహాలకు బదులు ఆయన మాస్కులు పెట్టాడు. వారి శరీరాలను కూడా ప్రత్యేక తరహాలో చూపించాడు. నిజానికి పికాసో మొదటి దశలో బ్లూ న్యూడ్, తర్వాత టూ న్యూడ్స్ అనే పేరిట నగ్న శరీరాలను చిత్రిస్తూ వచ్చాడు.

1918-27 మధ్య కాలాన్ని ప్రామాణిక దశ అని పిలుస్తుంటారు. పికాసో తన చిత్రకళలో క్యూబిజం అనే నూతన పద్ధతిని తీసుకుని వచ్చి సంప్రదాయ పద్ధతులను అధిగమించాడు. మొత్తం చిత్రం ఏకఖండంగా గాక అనేక ఘనాలుగా ఖండాలుగా వేయడం, రంగులను అనేక విధాల ఉపయోగించడం ఇందులో ప్రత్యేకత. దీనివల్ల బొమ్మ కళ్లకు కట్టడమే గాక దానితో ముడిపడిన ఘర్షణ,

గెర్నికా

చూసే వారి భావ కంపనం కూడా చిత్రించినట్టవుతుంది. కొద్ది కాలంలోనే క్యూబిజం ఒక నూతన వరవడిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత కాలంలో ఆయన సింథటిక్ క్యూబిజం అని దాన్ని మరి కొంత మెరుగుపర్చారు. వాస్తవానికి ప్రపంచం పికాసోను అధికంగా గుర్తు పెట్టుకోవడానికి కారణమైన దశ ఆ తర్వాత ప్రారంభమైంది. ఫాసిజానికి స్పెయిన్‌లో అంతర్యుద్ధానికి వ్యతిరేకంగా పికాసో అగ్రభాగాన నిలిచాడు. కమ్యూనిస్టులతో శాంతి కాముకులతో కలసి నడిచాడు. స్పెయిన్ నియంత ఫ్రాంకో కుమ్మక్కుతో హిట్లర్ సైన్యాలు గుయేర్నికా అన్న పట్టణంపై బాంబులతో దాడి చేసి 1800 మందికి పైగా మరణించడానికి, అనేక అఘాయిత్యాలకు కారకులయ్యారు. దాన్నే అతి పెద్ద కాన్వాసు మీద పికాసో 'గెర్నికా' చిత్రంగా గీశాడు. ఇప్పటికి అదే ఫాసిస్టు వ్యతిరేకతను ప్రతీకగా మిగిలిపోయింది. ఈ చిత్రంలో పికాసో ఫాసిస్టులను ఎద్దులుగానూ వారిపై పోరాడే ప్రజలను గుర్రాలుగానూ చిత్రించారు. ఆ అమానుషానికి, మహిళలపై జరిగిన అనేక అత్యాచారాలకు సూచనగా తెగిపడిన అవయవాలు, ఖండిత శిరస్సులు చూపించాడు అలాగే ప్రపంచ శాంతికి చిహ్నంగా పావురం గుర్తును ప్రవేశపెట్టింది కూడా పికాసోనే. 1944లో ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీలో చేరిన పికాసో చివరి వరకూ చాలా శ్రద్ధగా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకునేవాడు. దాహార్తి నీటి చెలిమ దగ్గరకు వెళ్లినట్టు నేను పార్టీ సభ్యత్వం కోసం వెళతాను అనేవాడు.పికాసో 1973 ఏప్రిల్ 8న కన్నుమూశారు. కాని ఆయన చిత్రాలు ఇప్పటికీ వేల కోట్ల ఖరీదుకు అమ్ముడవుతుంటాయి. పారిస్‌లో ఆయన గీసిన 500 చిత్రాలతోనే ప్రత్యేకంగా ఒక మ్యూజియం వుంది. చిత్రకళాభిమానులు దాన్ని ఎంతో ఆరాధనగా సందర్శిస్తుంటారు. ప్రతిభ ఎంత వున్నా ప్రయోగాలు ఎన్ని చేసినా ప్రజా ఉద్యమాలతో చివరి వరకూ మమేకం కావడం పికాసో గొప్పతనం. అందుకు ఆయన చిరస్మరణీయుడు.

✦

కాటికాపరి కనకమ్మ

శ్మశానంలో సాధారణంగా మగవాళ్లే పని చేయడం చూస్తుంటాం. కాటి కాపరులుగా వారే వుంటారు. శవాలను దహనానికి సిద్ధం చేయడం... కట్టెల మీద పండ బెట్టడం...ప్రాణం లేని ఆ కట్టె పూర్తిగా కాలే వరకు దగ్గరుండి చూసుకోవడం... మధ్యలో నీలుక్కొన్నా... నిలబడినా... పూర్తిగా దహనమయ్యేలా చూడడం కాటి కాపరి ప్రధాన విధులు. ఆ పనులు చేసే వారు పాషాణ హృదయులైవుండాలని అనుకుంటూ వుంటాం. అలాంటిది ఓ మహిళ ఆ పనిలో వుంటే...! తెలుసుకోవాలంటే విశాఖపట్నం వెళ్లాల్సిందే.

ఆమె పేరు ఉప్పు కనకమ్మ. విశాఖలోని గురుద్వార జంక్షన్లోని శ్మశాన వాటికలో పదేళ్లగా పనిచేస్తోంది. సమాధులు తవ్వడం... దహనానికి కట్టెలను పోగుచేయడం... బంధువర్గం నిప్పు పెట్టి వెళ్లిపోయాక శవం పూర్తిగా కాలేట్టు జాగ్రత్తలు తీసుకోవడం.. అనుదినం ఆమె చేసే పనులు. ఇదంతా చదువుతుంటే ఆమె ఎంత కఠినాత్మురాలో అనిపిస్తుంది. కానీ ఆమె వెనక దాగిన కథ వింటే అది అణుమాత్రం వాస్తవం కాదనిపిస్తుంది. పదేళ్ల కిందట శ్మశానవాటికలో పనిచేసే వ్యక్తితో ఆమెకు పెళ్లయింది. తాగుబోతు కావడంతో...అతనిని కనిపెట్టుకుని వుండేది అనుక్షణం. అందుకోసం అతని వెంటే వుండేది. తాగుడుకు తోడు క్షయ వ్యాధి సోకడంతో ఎనిమిదేళ్ల కిందటే చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో...తల్లితో కలిసి సీతమ్మ పేటలో వుంటూ భర్త చేసే పనిని చేపట్టింది. ఆమె పని ఉదయం ఏడు గంటలకే మొదలౌతుంది. ముసలి తల్లికి, తనకు వంట చేసుకుని శ్మశాన వాటికకు బయల్దేరుతుంది. అక్కడే శవాల కోసం ఎదురుచూస్తుంటుంది. ఒక్కోరోజు రెండు మూడు శవాలు వస్తాయి. ఒక్కోసారి అస్సలు రావు. సీతమ్మధార వాసులు తమ వాళ్లు

ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలను చావుల మాధుమ్‌కే తీసుకెళ్తున్నారు. మరి వాళ్లైతే శవాన్ని తీసుకెళ్లడానికి వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తారట. దాంతో కనకమ్మ పనిచేసే దగ్గరకు శవాలు తక్కువగా వస్తుంటాయి. అయినప్పటికీ ఆమెకు తిండి తినేందుకు కాసేపు తీరిక దొరకదు. వీలుంటే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు మధ్యలో ఇంటికెళ్లి వస్తుంది. కుదరని పక్షంలో ముసలి తల్లే ఇంత అన్నం డబ్బాలో వేసుకొచ్చి ఇస్తుంటుంది. అక్కడే శ్మశాన వాటికలో ఓ మూలన కూర్చుని నాలుగు మెతుకులు తినేయడం అలవాటు చేసుకుందామె. శవాల తాలూకు బంధువులు ఇచ్చిన చిల్లరే ఆమెకు ప్రధాన ఆదాయ వనరు. ఇంత చేస్తున్నా... విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో సైతం... ఆమె పేరు నమోదు కాలేదు. విచిత్రం ఏమంటే ... తన నిశానీతో... చనిపోయిన వారి మరణ ధృవ పత్రాలు కూడా ఇస్తుంటుంది. అంటే ఆమెది గుర్తింపు లేని ఉద్యోగం అన్నమాట.

✦



నా కథ...

విశాలమైన సముద్రతీరం...
ఆహ్లాదపరిచే పర్వతాల తోరణం ...
ప్రతిష్టాత్మకమైన పరిశ్రమల సముదాయం ...
పరవశం కలిగించే పర్యాటక సోయగం ...
ఇవన్నీ ఒక దగ్గర కుప్ప పోస్తే ఏమవుతుంది?
ఏ పట్టణం రూపు దిద్దుకుంటుంది?
ప్రఖ్యాతి గాంచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ...
ఆంధ్రుల హక్కుగా సాకారమైన ఉక్కు కర్మాగారం ..
దేశానికే తలమానికం తూర్పు నావికాదళం ..
చారిత్రక క్షేత్రం సింహాచల దేవళం ...
ఇందులో ఏ ఒక్కటి తలచినా ఏ నగరం గుర్తొస్తుంది?
అవును ... విశాఖపట్నం.
ఇది అనేకనేక విశేషాల, విఖ్యాతుల పొట్లాం.
తన ప్రత్యేకతలను, ప్రస్థానాన్ని తానే మనసు విప్పి చెబుతుంది మన విశాఖ.
విందామా మరి?

ప్రారంభం

నా కథ నాకే కొత్తగా ఉంటుంది; రోజురోజుకూ సంతరించుకునే కొత్త హంగులు, విస్తరణ కళ్లారా చూసి. నా ప్రస్థానం నాకే గర్వకారణంగా ఉంటుంది; ప్రపంచవ్యాప్తం అయిన, అవుతున్న నా ప్రఖ్యాతిని, ప్రాధాన్యాన్నీ మనసారా తలచి.

నాది రెండు వేల సంవత్సరాల చరిత్ర. మొదట్లో ఓ చిన్న మత్స్యకార పల్లెను. ప్రపంచ జ్ఞానం ఏమాత్రమూ లేని ఆదిమతల్లిని. నా పక్కన అనంతంగా విస్తరించి ఉన్న సముద్రమే నా ఉనికి, ఉన్నతి. నా ప్రగతిలోనూ, ప్రస్థానంలోనూ అదే కీలకం. అనేకనేక అభివృద్ధి ఆభరణాలు నాకు అమరటానికి కడలి కరుణే కారణం!

అనేక పేర్లు నాకు ...

విశాఖపట్నం, వైజాగ్, వైజాగ్‌పటం, వాల్తేరు, స్టీల్‌సిటీ... ఇవన్నీ నా పేర్లు. ఎలా పిలిచినా ముద్దుగానే ఉంటుంది. విశాఖ అనే పేరు రావటానికి కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. సముద్రతీరాన వైశాఖేశ్వర ఆలయం ఉండేదని, దానికి ఆనుకొని ఏర్పడ్డ ఊరిని కాబట్టి– ఆ పేరు వచ్చిందని ఒక కథనం. విశాఖ వర్మ అనే రాజు పాలించాడు కాబట్టి– అని మరొక కథనం. ఇసాక్ మదీనా అనే ముస్లిం పాలకుడి పేరుతో ఏర్పడ్డానని ఇంకొక కథనం. పేరుకు కారణం ఏదైనా నేను మీ విశాఖను.. ఇప్పుడు మహా విశాఖను.

నిజానికి ఇప్పటి నా మహారూపం ఒకప్పుడు అనేక పల్లెటూళ్ల సముదాయం. ఒక ఊరి నుంచి ఒక ఊరికి వెళ్లాలంటే పొలాలు, తోటలు దాటి వెళ్లాల్సిందే! కాలినడకో, గుర్రపు బళ్లనో ఆశ్రయించాల్సిందే! ఇప్పటి వన్‌టౌన్ ప్రాంతమే అసలు విశాఖ. తరువాతి కాలంలో అన్నీ కలిసిపోయాయి. 1923 నాటికి నా జనాభా 44 వేలయితే, ఇప్పుడు 20 లక్షలు. ఎన్ని రెట్లు పెరిగానో చూడండి!

ఎందరో పాలకులు

నేను అనేకమంది పాలకులను చూశాను. అనేక పరిణామాలకు గురయ్యాను. కళింగులు, విష్ణుకుండినులు, శాతవాహనులు, రెడ్డి రాజులు, విజయనగరాధీశులు, మొగలాయిలు ... ఇలా ఎందరో! పాలించారు.. యుద్ధాల్లో రక్తమూ పారించారు. నా గడ్డపై అడుగుపెట్టిన తొలి విదేశీయులు డచ్చి వారు. తొలుత భీమునిపట్నంలో వాణిజ్యకేంద్రం

పరిశ్రమలూ ... ప్రారంభాలూ ...

విశాఖలో హార్బరు నిర్మాణం 1922లో ప్రారంభమైంది. 1923 నవంబరు 23న వచ్చిన పెను తుపానులో ఆ నిర్మాణ పనులు కొట్టుకుపోయాయి. ఆ తరువాత మళ్లీ మొదలుపెట్టి 1927 నాటికి పూర్తి చేశారు. దీనిని బెంగాల్ – నాగపూర్ రైల్వేను నిర్వహిస్తున్న విదేశీ కంపెనీ నిర్మించింది. 1956 వరకూ హార్బరు దాని అజమాయిషీలోనే ఉంది. తరువాత ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది.

- విద్యార్థులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకుల ఆందోళనల ఫలితంగానే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. అప్పటివరకూ మద్రాసు విశ్వవిద్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. 1930 సెప్టెంబరు 5న యూనివర్సిటీ వాల్తేరుకు వచ్చింది. దానికి ముందు కొన్నాళ్లు విజయవాడలో నడిపారు.
- రెండో ప్రపంచ యుద్ధ అవసరాలకోసం విశాఖపట్నం విమానాశ్రయం నిర్మించారు. ఆ తరువాత దానిని సివిల్ ఏవియేషన్ డిపార్టుమెంటుకు అప్పగించారు. 1939 డిసెంబర్లో నేవల్ బేస్ ఏర్పాటు చేశారు. ఇది కూడా రెండో ప్రపంచ యుద్ధ అవసరాల కోసమే! అదే అంచెలంచెలుగా నేడు తూర్పు నావికాదళంగా విస్తరించింది.
- హిందూస్థాన్ షిప్‌యార్డు నిర్మాణం 1941లో మొదలై 1946కి కార్యకలాపాలు ప్రారంభించింది. 1952 జనవరి 21న జాతికి అంకితం అయింది.
- విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల పోరాట ఫలితం. 1966లో రాష్ట్ర ప్రజలు ఉద్యమించి సాధించారు. పోలీసు కాల్పుల్లో 32 మంది చనిపోయారు. కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు అందరూ రాజీనామా చేసి ఉద్యమంలోకి వచ్చారు. తెన్నేటి విశ్వనాథం, అమృతరావు తదితరుల ఆందోళనల ఫలితంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చింది. 1971లో శంకుస్థాపన చేశారు. 1983 నాటికి నిర్మాణం పూర్తయింది.

ఏర్పాటు చేసుకున్నారు. 1630లో విశాఖపట్నం వచ్చారు. అప్పుడు నా జనాభా మూడు వేలు! 1683 ప్రాంతంలో ఆంగ్లేయులు నగర ప్రవేశం చేశారు. ఈ క్రమంలోనే వారి ఆధిపత్య పోరాటాలకు అతలాకుతలం అయ్యాను. నెమ్మది నెమ్మదిగా బ్రిటీషు పాలకుల పట్టు బిగిసింది. 1726 నాటికి ఈస్టిండియా కంపెనీ భవనాలు, కోటలు నిర్మించింది. ఆంగ్లేయులు పాలనలో కట్టుదిట్టమైన, కఠినమైన పద్ధతులు అవలంబించారు. ఈకాలంలోనే నేను ప్రధాన పాలనా కేంద్రంగా రూపుదిద్దుకున్నాను. ప్రారంభంలో ఉత్తరాంధ్ర మొత్తానికి నేనే కేంద్రాన్ని. స్వాతంత్ర్యం అనంతరం 1950లో శ్రీకాకుళం జిల్లాను, 1979లో విజయనగరం జిల్లానూ ఏర్పాటు చేశారు.

పోర్టుతో అభివృద్ధికి శ్రీకారం

ఈ ప్రాంతంలో రెండు ఓడరేవులు తొలినుంచీ ఉండేవి. ఒకటి భీమిలి. రెండోది విశాఖ. డచ్చి వారి పాలనలో భీమిలి రేవు వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. ఈస్టిండియా కంపెనీ ఆధిపత్యంలోకి వచ్చాక విశాఖ రేవుపై కేంద్రీకరించింది. 1922లో హార్బరు నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. పెట్టనికోటలా ఉన్న డాల్ఫిన్స్ నోస్ కొండ, ఉప్పుటేరు మధ్యన సహజసిద్ధమైన హార్బరు కొద్దిపాటి నిర్మాణ పనులతోనే సాకారం అయింది. 1927 నాటికి నిర్మాణం పూర్తయింది. 1933 డిసెంబరు 19న అప్పటి వైస్రాయి లార్డు వెల్లింగ్టన్ లాంఛనంగా ప్రారంభించారు. విశాఖ హార్బరు, పోర్టు, రైల్వే వంటివి నా ప్రగతికి ఎంతగానో దోహదపడ్డాయి. ఎందరెందరో ఉద్యోగం, ఉపాధిరీత్యా వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి నా ఒడికి చేరారు. నిర్మాణ పనుల్లో, తరువాత రోజువారీ పనుల్లో ఉపాధి పొందారు. ఈ అభివృద్ధి కొన్ని వేల మందికి శాశ్వత భద్రతని కల్పించటం నాకెంతో సంతోషం కలిగించింది. తరువాతి కాలంలో ఏర్పడ్డ షిప్‌యార్డు, బిహెచ్‌పివి (ఇప్పుడు భెల్), హెచ్‌పిసిఎల్, స్టీల్‌ప్లాంటు వంటివి నన్ను గొప్ప పారిశ్రామిక నగరిగా మార్చాయి. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా

అవతరించేలా చేశాయి.

విద్యాలయాల నిలయాన్ని ...

నా వైజ్ఞానిక పరిధిని పెంచటంలో ఇక్కడ ఉన్న ఎన్నో విద్యాసంస్థలు దోహదపడ్డాయి. అప్పట్లో హిందూ కళాశాలగా పేరొందిన ఇప్పటి ఎవిఎన్ కళాశాల ఎంతోమంది విజ్ఞానులను తీర్చిదిద్దింది. ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సివి రామన్, గణాంకవేత్త సివి రావు, మహాకవి శ్రీశ్రీ, మన్యం వీరుడు అల్లూరి వంటి నా ప్రియమైన బిడ్డలు ఇక్కడే విద్యాబుద్ధులు నేర్చారు.

1930లో ఏర్పడ్డ ఆంధ్ర విశ్వ విద్యాలయం నాకు అమరిన గొప్ప విజ్ఞానాభరణం. ఎందరెందరో మహామహులు ఇక్కడ విద్యాబోధన చేశారు. మరెందరెందరో నా ఒడిలో చదువుకొని, ఈనాడు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, హుమాయున్ కబీర్, హిరేన్ ముఖర్జీ, ఎంసి చాగ్లా, సూరి భగవంతం, అబ్బూరి రామకృష్ణారావు వంటి మేధావులు ఇక్కడ పనిచేశారు. ఇప్పుడు ఈ విశ్వవిద్యాలయం అనేక విభాగాలుగా విస్తరించింది. కొన్ని వేల మంది మేధావులను అనేక రంగాల్లో దేశానికి అందించింది. 1942లో ఈ విశ్వవిద్యాలయం తాత్కాలికంగా గుంటూరుకు మారింది. అది





బొజ్జన్న కొండ

రెండో ప్రపంచ యుద్ధ సమయం. జపాన్ విమానాలు నాపై బాంబులు వేయటంతో పరీక్షలకు ఆటంకం కలగకూడదని ఈ మార్పు చేశారు. ఆంధ్ర వైద్య కళాశాల 1923లోనే ప్రారంభమైంది. తరువాతి కాలంలో నా చుట్టూ అనేక ప్రయివేటు విద్యాసంస్థలు ఏర్పడ్డాయి. ప్రఖ్యాత విద్యాసంస్థల నిలయంగా అలరారేలా చేశాయి.

ఉద్యమాల నేలను ...

పరాయి పాలన నుంచి దేశవిముక్తి కోసం జరిపిన పోరాటాలన్నిటికీ నేను వేదికనే. లాఠీ దెబ్బలకు, తూటా గర్జనలకు ప్రత్యక్ష సాక్షినే. ఉప్పు సత్యాగ్రహానికి నా సముద్రతీరం ఆలవాలం. నా బడిలోనే చదువుకున్న అల్లూరి రామరాజు తరువాతి కాలంలో మన్నెం వీరుడై పోరాడాడు. ఆంధ్రదేశం నుంచి స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టయిన తొలి మహిళ దిగుమర్తి జానకీబాయి నా బిడ్డే. పురిపండా అప్పలస్వామి, మారేపల్లి రామచంద్ర శాస్త్రి, తెన్నేటి విశ్వనాథం వంటి సమరయోధులు ఇక్కడివారే!

నేను ఎన్నో ఉద్యమాలకు పురిటిగడ్డను. కార్మిక పోరాటాలకు పెద్దమ్మను. స్వాతంత్ర్యానికి ముందూ, వెనకా కూడా ఇలాంటి నేపథ్యం ఉంది నాకు. విశాఖ పోర్టు కార్మికుల పోరాటం, అనకాపల్లి ప్రాంతంలో రైతాంగ ఉద్యమం, మన్యంలో అల్లూరి తిరుగుబాటు నా సమరశీలతకు సాక్ష్యాలు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అని నినదించి సాధించిన కర్మాగారం నాకు గర్వకారణం. దీని సాధనలోనూ, పరిరక్షణలోనూ ప్రజా ఉద్యమం ఉంది. ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను కాపాడుకోటానికి ఇప్పటికీ ఇదే ఒరవడి సాగుతోంది.

కీర్తిని పెంచిన సృజనకారులు ..

అభ్యుదయానికి, మంచి మార్పుకూ నేనెప్పుడూ చిరునామానే. ప్రపంచంలో వచ్చే ప్రతి మంచినీ ఆహ్వానించాను. ప్రతి చెడ్డపైనా ప్రతిస్పందించాను. వాడుక భాషా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గిడుగు రామ్మూర్తి, తన రచనలతో సంఘాభ్యుదయాన్ని ఆకాంక్షించిన గురజాడ అప్పారావు .. వంటివారు ఇలాంటి కృషిలో మేలిమి ముత్యాలు. మహాకవిగా ఎదిగిన శ్రీరంగం శ్రీనివాసరావు ఇక్కడే పుట్టి పెరిగాడు. ఆధునిక భావాలను, కవిత్వాన్ని ప్రభంజనంలా వెలయించాడు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఏర్పడ్డ తొలినాళ్లలోనే కమ్యూనిస్టు సాహిత్యం వ్యాప్తి చేయటంలో ఒక కేంద్రంగా పనిచేసింది. ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ విదేశాల నుంచి మార్క్సిస్టు గ్రంథాలను తీసుకొచ్చి విద్యార్థులకు అందుబాట్లో ఉంచారు. అప్పుడు లైబ్రేరియన్‌గా ఉన్న అబ్బూరి రామకృష్ణారావు శ్రీశ్రీకి అభ్యుదయ రచయితల మేనిఫెస్టోని పరిచయం చేశారు. ఆ తరువాతనే శ్రీశ్రీ తన కవిత్వ వరవడిని మార్చాడు. 'జయభేరి' గీతంతో కొత్త కవిత్వ నగారా మోగించాడు. తెలుగు సాహితీలోకాన్ని మేల్కొలిపి, మరో ప్రపంచం వైపు నడిపించాడు. రావిశాస్త్రి, ఆరుద్ర, కాళీపట్నం రామారావు వంటి అభ్యుదయ రచయితలు నా కీర్తిని మరింత పెంచారు. సాహిత్య కళారంగాల్లో ఇలాంటి ముద్దుబిడ్డలు అనేకమంది ఉన్నారు. గణపతిరాజు అచ్యుతరామరాజు, దివాకర్ల రామమూర్తి, గణేష్ పాత్రో, జెవి సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, రావి కొండలరావు, ప్రఖ్యాత శిల్పకళాకారుడు అంట్యాకుల పైడిరాజు వంటివారు ఆ వరుసలో కొందరు. వీరంతా తమ ప్రతిభ ద్వారా నా కీర్తిని శాశ్వతం చేశారు.

స్థానిక సంస్కృతీ సాంప్రదాయాలు

సహజంగా నా బిడ్డలు సాధు స్వభావులు, నిరంతర శ్రామికులు, స్నేహపాత్రులు. 50 ఏళ్ల క్రితం దాకా వానలపై ఆధారపడే మెట్ట వ్యవసాయమే దిక్కు. చాలాకాలం పాటు ఉపాధికి సరైన ఆదరువు లేనందువల్ల తీవ్రమైన వెనకబాటుతనం ఉంది. ప్రభుత్వరంగ పరిశ్రమలు వచ్చాక నెమ్మదిగా మార్పులు చోటు చేసుకున్నాయి. అభివృద్ధి ఫలాలు అందుతున్న దశలోనే సరళీకరణ విధానాలు వచ్చి చిచ్చు పెట్టాయి. పేరుకు అభివృద్ధి అని చెబుతున్నా– 20 ఏళ్ల కాలంలో నా బిడ్డలకు స్థిరమైన ఉద్యోగ కల్పన లేదు. పైగా ప్రభుత్వరంగ పరిశ్రమల్లో వేల ఉద్యోగాలు తగ్గిపోయాయి. గ్యారంటీ లేని తాత్కాలిక కొలువులు ఎక్కువయ్యాయి.

బతుకు ఎలా ఉన్నా నా బిడ్డల ఆటపాటల

విశాఖలో ఇవీ తొలి ..

- విశాఖపట్నం వీధుల్లో 1933లో విద్యుత్ దీపాలు వెలిగాయి. దానికన్నా ముందు వీధుల్లో కిరోసిన్ దీపాలు వెలిగించేవారు.
- విశాఖపట్నంలో తొలి ఫొటో స్టూడియోను రత్నవేలు మొదలియారు అనే తమిళుడు పెట్టాడు. దాని పేరు రత్నం ఫొటో స్టూడియో. ఆయన చిత్రకారుడు, నటుడు కూడా!
- విశాఖలో మొట్టమొదట నిర్మించిన సినిమా హాలు పూర్ణా థియేటరు. దీనిని 1934లో నిర్మించారు. ఇది ఇప్పటికీ రన్నింగులో ఉండడం విశేషం.
- 1936లోనే విశాఖలో సినిమా స్టూడియో నిర్మించారు. గొట్టుముక్కల జగన్నాధరాజు అనే ఆయన ఆంధ్రా సినీటోన్ పేరుతో దీనిని సీతమ్మధారలో నిర్మించారు. దాన్లో భక్త జయదేవ్, పాశుపతాస్త్రం అనే రెండు టాకీ చిత్రాలు నిర్మించారు. తరువాత మూత పడింది.

సమ్మోహన విశాఖ

విశాఖనగరం ఎప్పుడూ ఒక గొప్ప సమ్మోహక శక్తి. అందరినీ అలరిస్తూ, ఆకర్షిస్తూనే ఉంటుంది. అందుకనే విశాఖలో నివసించే కళాహృదయులు ఎవరైనా తన గురించి ఏదొకటి రాయాల్సిందే! శ్రీశ్రీ, ఆరుద్ర, రావిశాస్త్రి వంటి వారు ఈ వీధుల్లో తిరుగాడుతూ పద్యాలల్లారు. కథలు కూర్చారు. చలం రచనల నిండా భీమిలి ఉండనే ఉంటుంది. తరువాతి తరంలోనూ కవులూ రచయితలూ విశాఖ ప్రభావంతో రచనలు చేశారు. 1948లో శ్రీశ్రీ ఈ పట్టణం గురించి చెబుతూ .."యారాడకొండ మీద ఒంటరిగా నిలబడి ఒక్కొక్కరోజు ఒక్కొక్క రకపు విశాఖపట్టణాన్ని చూశాను... ఎప్పటికైనా నేనొక పదిహేనాశ్వాసాల మహా కావ్యం రాస్తాను.. దాని పేరు 'విశాఖపట్టణం..'' అని పేర్కొన్నాడు. ఎంచేతనో ఆయన ఆ కావ్యం రాయలేదు.. కానీ, చాలామంది కథగానో, కవితగానో విశాఖను అక్షరబద్ధం చేస్తూనే ఉన్నారు. మానేపల్లి సత్యనారాయణ 'విశాఖపట్నమ్' పేరిట కవిత్వం రాశారు. తనకు తెలిసిన విశాఖ ఏఏ సంవత్సరంలో ఎలా ఉందో వర్ణించారు. ఉద్యోగరీత్యా విశాఖలో చాలా కాలం ఉన్న ఐఎఎస్ అధికారి అంగుళకుర్తి విద్యాసాగర్ 'విశాఖా .. నా విశాఖా..' అంటూ దీర్ఘ కవిత్వం వెలువరించారు.

వెనక బలమైన స్థానిక సంస్కృతి ఉంది. నేనొక కాస్మోపాలిటన్ సిటీగా మారుతున్నా- స్థానిక సందళ్లూ, సంబరాలూ సాగుతూనే ఉంటాయి. కొత్త మార్పులకు గురవుతూనే సాంప్రదాయం సాగుతోంది. పోలమాంబ, గౌరమ్మ, కుంచుమాంబ, పేరంటల్లమ్మ, గౌండ్లమ్మ వంటి పేర్లతో ఆదినుంచి వస్తున్న పండగలు నడుస్తూనే ఉన్నాయి. వాణిజ్యకేంద్రంగా మారిన జగదాంబ జంక్షన్ ఒకప్పుడు ఎల్లమ్మ తోట. ఓ నలభై ఏళ్ల క్రితం ఇది పాత పట్టణానికి పొలి మేర. ఊరికి హద్దుగా, ఎల్లగా భావించే చోట గ్రామదేవతను ప్రతిష్ఠించటం ఆనవాయితీ. అలా నెలకొన్న ఎల్లమ్మ అమ్మవారికి ఇప్పటికీ జాతర చేస్తారు. నగరం నిండా ఇలాంటి అమ్మవార్లు వందల్లో ఉంటారు. క్రమం తప్పకుండా అన్నిచోట్లా జాతరలు జరుగుతూనే ఉంటాయి. ఉక్కు నిర్వాసిత గ్రామాల్లోనూ, మత్స్యకార ప్రాంతాల్లోనూ ఈ సందడి ఎక్కువగా కనిపిస్తోంది. స్థానిక ప్రజల్లో ప్రచారం, ఆదరణ కోసం వ్యాపార సంస్థలూ, రాజకీయ నాయకులూ స్పాన్సరింగ్ చేయడం, విరాళాలూ ఇవ్వడం ఈకాలంలో బాగా పెరిగింది. దీంతో, ఈ పండగలు మరింత కోలాహలంగా జరుగుతున్నాయి.

ప్రకృతి అందాల నెలవుని

నా పేరు వింటేనే చాలామందికి సహజంగా ప్రకృతి అందాలు స్ఫురిస్తాయి. సహజసిద్ధ సౌందర్యమే నా సౌభాగ్యం. ఆకాశాన్ని చుంబిస్తున్నట్టు కనబడే విశాఖ సాగరం నాకొక ప్రకృతి అలంకారం. సాయం సంధ్యవేళల్లో వీక్షకులతో సాగరతీరం కళకళ్లాడిపోతూ ఉంటుంది. అలా వెళ్లి కైలాసగిరి అధిరోహిస్తే ... నా అందాలు తనివితీరా చూడొచ్చు. ఆ దారిలోనే ఉడా పార్కు. సాగర సౌందర్యం తిలకిస్తూ ... పార్కులో కాలక్షేపం చేయొచ్చు. ఒకప్పటి సమర ప్రవీణ కురుసుర జలంతర్గామి- ఇప్పుడు ఆసక్తి రేకెత్తించే



మ్యూజియం. దీనిని ఆర్కే బీచ్‌లో దర్శించవచ్చు. మసీదు, గుడి, చర్చి ఒకే దగ్గర ఉన్న మత సామరస్య ప్రతీకను హార్బరు సమీపంలో చూడవచ్చు. ఒకప్పటి బౌద్ధారామాల చిహ్నాలను, బొజ్జన్నకొండ, తొట్లకొండ, బావికొండలపై గమనించవచ్చు. అనేక సినిమా పాటల్లో కనిపించే ఎర్రమట్టి దిబ్బలను భీమిలి వెళ్లే దారిలో చూడొచ్చు. అసలు బీచ్‌రోడ్డు మీదుగా భీమిలి వెళ్లటం అనేదే ఒక ఆహ్లాదకర ప్రయాణం. 600 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు అనేక జంతువుల, పక్షుల నిలయం. ఆ పక్కనే కంబాలకొండ పర్వతారోహకులకు కలకండ. ఇక నగర పరిధి దాటి వెళితే ... 120 కిలోమీటర్ల దూరంలో అందాల అరకులోయ. దానికి దగ్గర్లోనే 10వ శతాబ్ది నాటి బొర్రా గుహలు అలరిస్తాయి. రణజిల్లెడ జలపాతాన్ని ఆ దగ్గర్లోనే చూడవచ్చు. విశాఖకు 16 కిలోమీటర్ల దూరంలో శిల్పకళకు నిలయమైన సింహాచలం ఉంది. శ్రీకృష్ణదేవరాయలు నాటిన విజయస్తూపం ఆ పరిసరాల్లో ఉంది.చారిత్రిక ప్రాంతాలు చూడాలంటే- అల్లూరి సీతారామరాజు, ఆయన సహచరుల సమాధులు ఉన్న కృష్ణాదేవిపేట వెళ్లాలి. అక్కడికి 30 కిలోమీటర్ల దూరంలో అల్లూరి పట్టుబడ్డ మంప ఉంది. ఆయన్ని కట్టి కాల్చి చంపిన రాజేంద్రపాలెం ఆ దార్లోనే తారసపడుతుంది. దేశానికే తలమానికమైన విశాఖ స్టీలుప్లాంటు, పోర్టు, షిప్‌యార్డు, హార్బరు వంటివన్నీ విజ్ఞానాన్ని పెంచే సందర్శనా స్థలాలే!

చివరి మాట!

కాలంతో పాటే నేనూ అనేక మార్పులకు గురవుతూ విస్తరిస్తున్నాను. దేశంలో ఏర్పడ్డ రెండో మున్సిపాలిటీ భీమిలిని, బెల్లం పట్టణంగా ప్రసిద్ధి చెందిన అనకాపల్లిని మూడేళ్ల క్రితం నాలో కలుపుకొని మహా విశాఖగా అవతరించాను. నా ఒడిలో పుట్టి పెరిగేవాళ్లు, వచ్చి చేరేవాళ్లూ రోజురోజుకూ పెరుగుతున్నారు. భిన్నత్వంలో ఏకత్వం, సామరస్య సహజీవనం నా సహజ స్వభావం. దానికి భంగం కలగకూడదు. రాష్ట్ర విభజన తరువాత నా ప్రాధాన్యం మరింత పెరిగింది. నా ఎదుగుదలకు, అభివృద్ధికి గల అవకాశాల మీద చర్చలు సాగుతున్నాయి. ఇదంతా సంతోషమే! అయితే, ఒక్కటే నా విన్నపం. అభివృద్ధి అంటే ఎత్తయిన టవర్లూ, ఏ కొందరికో లాభాలూ కాదు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి! ప్రగతి ఫలాలు ఎక్కువమందికి అందాలి. నా అభివృద్ధి తొలి దశలో అది జరిగింది. ఇప్పటి నమూనాలో, పాలకుల ఆలోచనల్లో అది కొరవడుతోంది. ఆ ధోరణి మారాలి. నేను ధన విశాఖను కాలేను, జన విశాఖగానే ఉండాలి. అదే నాకు ఆనందం.. అదే నాకు ఆరోగ్యం. అలా ఉండేలా అందరూ పూనుకోవాలి!

- సత్యాజీ

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ - భాగం -30

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

జెన్నీ తమను ఎంత ఆప్యాయంగా చూసిందంటే అందరికి ఆమె 'అమ్మ' అన్నాడు ఫ్రెడ్రిక్ వెస్నర్. ఇతను మార్క్స్ అనుచరుడు. పొడుగ్గా, అందంగా హుందాగా వున్న జెన్నీని చూస్తే అందరికీ గౌరవం. తాను కౌంట్ కూతుర్నన్న గర్వం ఆమెలో ఎప్పుడూ కనిపించలేదు. భర్త వెంట వున్న వాళ్లంతా కేవలం అలగా జనం అన్న తృణీకార భావన ఆమెలో ఎప్పుడూ కనిపించలేదు. నిస్వార్థంగా వున్నదేదో అందరికీ పంచి పెట్టింది. నిజానికి యిలా అందర్నీ చేరదీయడం వల్ల ఆమె వీళ్లకు మార్క్స్ కన్నా ఎక్కువ దగ్గరైంది. దురుసుగా వుండే వాళ్ళు కూడా ఆమె ముందర పిల్లి పిల్లలైపోయారు.

విద్యావంతురాలైన మహిళ ...తోటి వాళ్ల మీద ఎంత ప్రభావం చూపగలదో ఆమెను చూస్తే అర్ధమైంది. 'ఆమె మా అందరికీ అమ్మ, సోదరి, స్నేహితురాలు, హితైషి, ఆదర్శ మహిళ' అన్నాడు లీబ్‌క్నెష్ట్. 'చివరికి ఒక ప్రష్యన్ గుఢచారి కూడా ఆమెను చూసి తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. కేవలం భర్త మీద ప్రేమతో ఆమె ఈ జీవితం ఎంచుకున్నది. ఈ దుర్భర దారిద్ర్యం కూడా ఆమెకు కష్టమనిపించడం లేదు' అని నివేదిక పంపాడు.

ఈ సంరంభంలో తిరుగాడేవారు ముగ్గురు పిల్లలూ. పెద్దవాళ్లున్నారని వాళ్లనెప్పుడూ దూరంగా వెళ్లి ఆడుకొమ్మని చెప్పలేదెవరూ. పెద్దలు కూడా పిల్లల నుంచి నేర్చుకోవాల్సింది చాలా వుందని మార్క్స్ నమ్మకం ('పిల్లలు పెద్దల్ని పెంచాలి' అన్నాడు). వాళ్లకు సూచనలిచ్చాడే తప్ప ఎప్పుడూ ఆదేశించలేదు. ప్రతిపక్షాలతో చర్చల్లో ఎంతటి పరుష పదజాలాన్ని వాడినా ఇంట్లో పిల్లల ముందు మార్క్స్ 'సత్ ప్రవర్తన' ముందు ఇంగ్లీష్ గవర్నెస్‌లు కూడా దిగదుడుపే".

ఫ్రాన్సులోని లూయీ నెపోలియన్ ప్రభుత్వం నిరసనను ఇంచుమించు నిషేధించడంతో ప్రభుత్వ వ్యతిరేకులందరూ లండన్‌కు క్యూ కట్టారు. వీళ్లంతా 1848 నాటి తిరుగుబాటులో పాలు పంచుకున్న వాళ్లే. అందరూ మార్క్స్‌కు సుపరిచితులే. సహజంగానే లండన్‌కు చేరుకుని వాళ్లు చేసిన మెదటి పని ఒకసారి మార్క్స్‌ను పలకరించడం. అలా వచ్చిన వాళ్లలో ఒకడు లూయీ బ్లాంక్. పొద్దున్నే తలుపు తట్టాడు. మార్క్స్ యింకా నిద్ర లేవలేదు. తలుపు తీసి లోపలికి రమ్మంది లెంచెన్. ఆశ్చర్యం. నమ్మలేనట్టుగా ఇంటిని పరికించి చూశాడు లూయీ బ్లాంక్. పేదవాళ్ల యిల్లైనా ఇంత కన్నా బాగానే వుంటుంది. తాతల నాటి ఒక అద్దం ముందర నిల్చుని చూసుకున్నాడు. మొహం కడుక్కొని డ్రెస్ వేసుకుని ప్రవేశించాడు మార్క్స్. నిజానికి అతనికిప్పుడు వీళ్లెవ్వరితోనూ సంబంధాలు పునరుద్ధరించుకోవాలనే కోరిక లేదు. 1830 నాటి మాజిని లాంటి వాళ్లు కూడా తెలుసు. అవినీతికి అతీతుడు అని పేరుందతనికి. కాని మార్క్స్ గ్రహించాడు."వీళ్లందరూ మోసగాళ్లు. నక్కజిత్తుల గాళ్లు. యువకులు కష్టపడతారు. డబ్బు పోగు చేసుకోవటం, సొంత బాకా ఊదుకోవడం వీళ్ల పని. అందరూ ఎప్పటికప్పుడు విడిపోతారు. కొత్త సమీకరణాలు చేసుకుంటారు. అంతే తప్ప అసలు పని జరగదు. శరణార్థులూ అంతే. తమ గురించే తప్ప మరెవరి గురించి ఆలోచించరు". ఫిబ్రవరిలో ఎంగెల్స్‌కు అదే విషయం చెప్పాడు. ప్రజలు మనిద్దర్నీ ఒంటరిగా వదిలినందుకు సంతోషిస్తున్నాను. ఇది మనం పెట్టుకున్న నియమమే. పరస్పర పొగడ్తలు, మర్యాద కోసం నయవంచకులను కూడా భరించటం, చివరికి వాళ్లతో పాటు మనమూ అప్రతిష్ట పాలు కావడం – ఇక ఈ ప్రహసనం ముగిసింది."

మార్క్స్ అభిప్రాయంతో ఏకీభవించాడు ఎంగెల్స్. ఇష్టం లేని చోట వుంటే మనుషులు బడుద్ధాయిల్లా తయారవుతారు. ఎవరికి నచ్చిన చోటికి వాళ్లు వెళ్లిపోవటమే శ్రేయస్కరం. విప్లవ పార్టీ అని పేరు పెట్టుకున్నంత మాత్రాన దాన్ని ఖాతరు చేయక స్వతంత్రంగా రాయగలిగినవాడే నిజాయితీపరుడు. వరుసలో అందరికన్నా వెనుకున్న గాడిద 'నేనే దేశాన్ని రక్షిస్తున్నాను' అన్నదంటే అంతకన్నా బూటకమేముంటుంది. ఇక యిప్పటి నుండే

మార్క్స్ జెన్నీ కూతురు జెన్నీ

" మంచం పైనుండి లేవలేదు జెన్నీ. ఫ్రాంజిస్కాను పాలదాయికి అప్పగించింది. తను పాలు తాగిన గుయిడో ఏమైనాడో ఆమె మరిచిపోలేదు. ఇంట్లో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవటానికి లారా ఎడ్గార్‌లు యింకా చిన్న వాళ్లు. కాని జెన్నీ పెద్దదైంది. ఇప్పుడా అమ్మాయికి ఆరేళ్ళు. ఇంట్లో అంతా సవ్యంగా లేదని తెలుసుకోగలదు. ఇదిలా వుండగా... ప్రష్యాలోని కమ్యూనిస్టు లీగ్ సహచరులను అరెస్టు చేస్తున్నారని వార్తలు వచ్చాయి. "

మనకు మనమే జవాబుదారీ. వాళ్లు మన అవసరాన్ని గుర్తించినప్పుడే మనం వాళ్లకు మన షరుతులేమిటో చెబుతాం. కనీసం అప్పటి దాకా ఒంటరిగా మూడు నెలలు గడిపానిక్కడ. "ఏదన్నా ప్రచురిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు. నీ పొలిటికల్ ఎకానమీ పుస్తకం వచ్చిన తర్వాత ఈ వదరు బోతులు నోరు విప్పగలరా?"

వీలైనంత త్వరగా పుస్తకం ముగించటానికే ప్రయత్నించాడు మార్క్స్. క్రియాశీలక రాజకీయాలు ఒక పెద్ద ఫార్సుగా మారాయి. ఇక సైద్ధాంతిక ప్రాతిపదిక నిర్మించవలసిన అవసరముంది. కాని వ్యక్తిగత సమస్యలు పనికి అవరోధాలు సృష్టించాయి. ఎంగెల్స్ కూడా తీర్చలేనంత అప్పు ఒకటి మార్క్స్‌కు గుదిబండగా మారింది. అనేక మందికి కలిపి నలభై పౌండ్లు బాకీ వున్నాడు. లండన్ నుంచి ట్రేయర్‌దాకా ఇదో స్కాండల్‌గా మారింది. నిస్పృహలో తనకు డబ్బివ్వకపోతే తాగి వచ్చి జైలుకు పోతానని వాళ్లని బెదిరించాడు. అయినా ఫలితం లేకపోయింది. ఆమె డబ్బు పంపలేదు. జేబులో చిల్లిగవ్వలేదు. ప్రతిదానికి అప్పే. బాకీలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. "ఆ పెటీ బూర్జువా బురదలో పీకల దాకా కూరుకుపోయాను. పైగా కార్మికులను దోచుకున్నానంటారు. కార్మిక నియంతృత్వం కావాలంటారు!" అంటూ ఎంగెల్స్‌తో వాపోయాడు.

ఈ గొడవల్లోనే మార్చి 28, 1851 నాడు జెన్నీ ఆడపిల్లను ప్రసవించింది. పేరు ఫ్రాంజిస్కా.

"ఫ్రాన్సులోని లూయీ నెపోలియన్ ప్రభుత్వం నిరసనను ఇంచుమించు నిషేధించడంతో ప్రభుత్వ వ్యతిరేకులందరూ లండన్‌కు క్యూ కట్టారు. వీళ్లంతా 1848 నాటి తిరుగుబాటులో పాలు పంచుకున్న వాళ్లే. అందరూ మార్క్స్‌కు సుపరిచితులే. సహజంగానే లండన్‌కు చేరుకుని వాళ్లు చేసిన మెదటి పని ఒకసారి మార్క్స్‌ను పలకరించడం. అలా వచ్చిన వాళ్లలో ఒకడు లూయీ బ్లాంక్. పొద్దున్నే తలుపు తట్టాడు. మార్క్స్ యింకా నిద్ర లేవలేదు. తలుపు తీసి లోపలికి రమ్మంది లెంచెన్. ఆశ్చర్యం. నమ్మలేనట్టుగా ఇంటిని పరికించి చూశాడు లూయీ బ్లాంక్. పేదవాళ్ల యిల్లైనా ఇంత కన్నా బాగానే వుంటుంది. తాతల నాటి ఒక అద్దం ముందర నిల్చుని చూసుకున్నాడు. మోహం కడుక్కొని డ్రెస్ వేసుకుని ప్రవేశించాడు మార్క్స్."

మార్క్స్ ప్రకారం సుఖప్రసవమేగాని జెన్నీ పడక మీదే వుంది. "అనారోగ్యం కాదు. ఇంటి గొడవలు" అన్నాడు మార్క్స్. అప్పటికి లెంచెన్ ఆరునెలల గర్భవతి. జెన్నీ ఈ విషయం గమనించే వుంటుంది గాని తండ్రి ఎవరో తెలిసే అవకాశం లేదు.

• • •

అంతటి కీలక సమయంలో ఇలాంటి స్కాండల్‌లో చిక్కుకోవటం దురదృష్టం. పారిశ్రామిక ప్రదర్శన కోసం యూరోపియన్ ప్రతిపక్షాలన్నీ లండన్‌కు వచ్చి వాలుతున్నాయి. వచ్చిన వాళ్ల దగ్గిర జేబుల నిండా డబ్బులున్నాయి. లండన్‌లో తిరుగుబాట్లకోసం రహస్యంగా జరుగుతున్న కుట్రల గురించి తెలుసుకోవటానికి శరణార్థులకు డబ్బులిస్తారు. శరణార్థులకిక పండగే పండగ. తాగినవాడికి తాగినంత. తిన్న వాడికి తిన్నంత. ఆగంతకులను నిరాశపరచలేదు. వాళ్లు నోరూరించే కబుర్లన్నీ చెప్పారు. తిరుగుబాటుదార్లు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. విప్లవానికి తేదీ కూడా ఖరారైంది. యుద్ధావసరాల కోసం బాండ్లు జారీ చేస్తున్నారు. (విప్లవం విజయవంతమైన తర్వాత కొత్త ప్రభుత్వం డబ్బు తిరిగి చెల్లిస్తుంది.)

• • •

ప్రదర్శనకు ముందు ఒక పుకారు వ్యాపించింది. లూయీ బ్లాంక్– రోలిన్ (వీళ్లిద్దరూ నిజానికి ప్రత్యర్థులు) కలిసి ఒక హే మార్కెట్ మద్యశాల నుండి ప్రపంచవ్యాప్త తిరుగుబాటుకు వ్యూహం రచిస్తున్నారు. ఏక కాలంలో తొంభై వేల మంది విదేశీ శరణార్థులు తాముంటున్న యిళ్లను తామే తగలపెట్టుకుంటారు. వీళ్లకు రెండు లక్షల మంది ఐరిష్ వాళ్లూ, క్యాథలిక్ ప్రీస్టులూ సహాయం చేస్తారు. ఇది నమ్మటానికే వీల్లేనంత మూర్ఖమైన పుకారు. అయినా ఈ విషయం పరిశోధించి తిరుగుబాటుదార్ల మీద చర్యలు తీసుకోవాలని యూరోపియన్ ప్రభుత్వం లండన్ పోలీసుల మీద బత్తిడి తెచ్చింది. ఇతర దేశాలలో విప్లవోద్యమాలకు కేంద్రం లండన్‌లో వుంటుంది. అధికారులు తిరుగుబాటునూ, హత్యను ప్రోత్సహిస్తారు "అనుకుంటున్నారు" అని రాశాడు వియన్నాలోని బ్రిటిష్ రాయబారి.

లండన్‌లోని తీవ్రవాదుల పట్ల కఠినమైన వైఖరి అవలంభించిన వాళ్లల్లో జెన్నీ సోదరుడు ఫెర్డినాండ్ వాన్ వెస్ట్‌ఫాలెన్ ఒకరు. గత డిసెంబరులో అతడు రష్యన్ హోం మినిస్టర్‌గా నియమింపబడ్డారు. ఆ తర్వాత వెంటనే జనవరి 1 నాడు ఒక ఆదేశ ం జారీ చేశాడు. దాని ప్రకారం పోలీసుల నిఘా లేకుండా ఏ రాజకీయ సమావేశము జరగకూడదు. పుస్తక ప్రచురణ ప్రభుత్వాధీనంలో మాత్రమే జరుగుతుంది. పత్రికలు ప్రచురించాలంటే పెద్ద మొత్తంలో పోలీసుల దగ్గర డబ్బు డిపాజిట్ చేయాలి. ఈ సందర్భంలో మార్క్స్‌కు ఎంగెల్స్ ఇలా రాశాడు. "పుస్తకాల నిషేధం గురించి మీ బావమరిది అత్యుత్సాహం చూపిస్తున్నాడు. త్వరలో అతడు నీ పుస్తకాల మీద కూడా పడతాడనిపిస్తుంది. అదే జరిగితే వచ్చే డబ్బు కూడా (వచ్చినా, అది స్వల్పం) ఆగిపోతుంది. ఇంగ్లండులో పెట్టుబడిదారీ స్వర్ణయుగం ప్రారంభమైనప్పుడే రష్యాలో రియాక్షనరీ దశాబ్దం ప్రారంభమైంది".

విప్లవ సమాచారమూ, పుస్తకాలూ, వ్యక్తులూ రష్యాలోకి ప్రవేశించకుండా చూడటమే వెస్ట్ ఫాలెన్ లక్ష్యం. రైల్వే స్టేషన్ల వద్ద ప్రత్యేకమైన గార్డులను నియమించాడు. నిఘా పెంచాడు. నిషిద్ధ రచనలు ప్రష్యాలోకి రాకుండా ఎక్కడికక్కడ వలలు పన్ని నిరీక్షించారు అధికారులు. విప్లవ కేంద్రం లండన్‌లోనే ఉందని ఫెర్డినాండ్ కూడా నమ్మాడు. 1851 లో కొందరు గూఢచారులను ఇంగ్లండుకు పంపి కుట్రదారులను ఏరివేయమని ఆదేశించాడు (మార్క్స్ మాటల్లో ఫెర్డినాండ్ ఒక రియాక్షనరీ ఉన్మాది). ఈ తీవ్రవాదులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటే ఇంగ్లండు రాణి కూడా వాళ్లను బహిష్కరించటానికి అంగీకరిస్తుంది. కాకపోతే సాక్ష్యాలు పక్కాగా ఉండాలి – వాస్తవాలు కానక్కర్లేదు.

• • •

మంచం పైనుండి లేవలేదు జెన్నీ. ఫ్రాంజిస్కాను పాలదాయికి అప్పగించింది. తను పాలు తాగిన గుయిడో ఏమైనాడో ఆమె మరిచిపోలేదు. ఇంట్లో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవటానికి లారా ఎడ్గార్‌లు యింకా చిన్న వాళ్లు. కాని జెన్నీ పెద్దదైంది. ఇప్పుడా అమ్మాయికి ఆరేళ్లు. ఇంట్లో అంతా సవ్యంగా లేదని తెలుసుకోగలదు. ఇదిలా వుండగా... ప్రష్యాలోని కమ్యూనిస్టు లీగ్ సహచరులను అరెస్టు చేస్తున్నారని వార్తలు వచ్చాయి.

సశేషం

▪ఫోన్: 91776 18708

నెహ్రూ భావ పరిణామం కార్యాచరణలపై
సాధికారిక సంక్షిప్త విశ్లేషణ

చరిత్రలో ఆయా సిద్ధాంతాలు వ్యక్తుల జీవితాలూ పుస్తకాలూ ఉద్యమాలు ఏవైనా సరే ప్రాధాన్యత ప్రభావశీలత ఒకేలా వుండవు. హెచ్చుతగ్గులుంటాయి. ఉధృతి ఉపసంహారం వుంటాయి. అనుకూల వ్యతిరేక వ్యాఖ్యానాలుంటాయి. కాలం గమనశీలం కనుక ఇవన్నీ సహజం. ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలలో భిన్న శక్తులు ఘర్షణ పడుతున్నప్పుడు ప్రతి అంశంపైనా రెండు కోణాలు వస్తుంటాయి. అందులోనూ దేశాలనూ సమాజాలనూ విశేషంగా ప్రభావితం చేసిన పునాది వ్యక్తుల విషయంలో ఈ విధమైన విశ్లేషణలు మరింతగా అవసరమవుతుంటాయి. పునఃపరిశీలనలూ పునరంచనాలు తప్పక జరుగుతుంటాయి. స్వతంత్ర భారత ప్రథమ ప్రధాని మాత్రమే గాక స్వాతంత్ర పోరాటంలోనూ సామాజిక రంగంలోనూ దేశాన్ని అమితంగా ప్రభావితం చేసిన జవహర్‌లాల్ నెహ్రూ భావ పరిణామం కార్యాచరణలపై సాధికారిక సంక్షిప్త విశ్లేషణ 'జవహర్ లాల్ నెహ్రూ జీవితం – కృషి'. భారత కమ్యూనిస్టు ఉద్యమ పితామహులలో ఒకరైన బి.టి.రణదివే దీని రచయిత. 1990లలో నెహ్రూ శతజయంతి సంవత్సరంలో చేసిన ఈ పరిశీలన ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకోవడానికి చాలా కారణాలే వున్నాయి.

గత ఇరవయ్యేళ్లకు పైబడిన కాలంలో నూతన ఆర్థిక విధానాలు లేదా సరళీకరణ మొదలైన తర్వాత అమితంగా దాడికి గురవుతున్న ఆలోచనల్లో నెహ్రూ నమూనా ఒకటి. అలీన విధానం, స్వావలంబన, ప్రభుత్వ రంగ నిర్మాణం, లౌకిక తత్వం వంటి ఆయన విధానాలను వైరి పక్షాలే గాక వారసులనే వారు కూడా తోసిపుచ్చుతున్నారు. బిజెపి ఆరెస్సెస్‌లు నెహ్రూపై దాడి చేస్తే అదో పద్ధతి. కాని నెహ్రూ గాంధీ కుటుంబం ముద్రతో కాంగ్రెస్‌ను దాని సంకీర్ణ ప్రభుత్వాలను నడిపిస్తున్నవారు మరింతగా ఆ వారసత్వాన్ని విడనాడుతున్నారు. ప్రైవేటీకరణ, అమెరికాకు లొంగుబాటు, మతశక్తులతో రాజీ వంటివి సర్వసాధారణంగా తయారైనాయి. 1991లో పివి నరసింహారావు హయాంలో మొదలై తర్వాత వాజపేయి, మన్మోహన్ ఎన్‌డిఎ యుపిఎ ప్రభుత్వాలు కొనసాగించిన అనర్థక విధానాలు ఇప్పుడు మరింత జోరందుకుంటున్నాయి. ప్రభుత్వ రంగ వాటాల అమ్మకం అలీనోద్యమానికి తిలోదకాలివ్వడం ప్రైవేటు కార్పొరేట్లకు ద్వారాలు తెరవడం ఇప్పుడు నిత్యకృత్యమై పోయింది. స్వాతంత్ర్యం రాకముందు నుంచీ నెహ్రూ వంటి వారు చెప్పిన సూత్రాలు ఇప్పుడెందుకు విడనాడవలసి వచ్చిందనేది ప్రశ్న.



జవహర్ లాల్ నెహ్రూ జీవితం - కృషి, రచన: బి.టి.రణదివే, అనువాదం: వి.ఆర్.బొమ్మారెడ్డి, ధర: రు.50/-, పేజీలు: 80, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, ఫోన్: 0866-577533.

ఇక నరేంద్ర మోడీ పగ్గాలు చేపట్టాక నెహ్రూపై బాహాటంగానే దాడి ప్రారంభమైంది. సర్దార్ పటేల్‌కూ నెహ్రూకు వ్యక్తిగతంగా పోటీ పెట్టి మాట్లాడటం పరిపాటి అయింది. గాడ్సే ఆనాడు గాంధీని గాక నెహ్రూను చంపి వుండాల్సిందని కేరళలో ఆరెస్సెస్ పత్రిక 'కేసరి'లో రాశారు. అంటే వారి కసి, క్రోధం ఏ స్థాయిలో వున్నాయో తెలుస్తుంది. తర్వాత కొంతకాలానికి గాడ్సేను దేశభక్తుడని కీర్తించేవరకూ వెళ్లారు. ఆయన విగ్రహాలు స్థాపిస్తామంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దాన్ని మించి సరళీకరణనూ సామ్రాజ్యవాద అనుకూలతనూ చూపిస్తున్నారు. చివరగా అసలు లౌకిక తత్వంపైనే దాడి చేస్తున్నారు. నెహ్రూ మొదలు పెట్టిన ప్రణాళికా వ్యవస్థను అధికారికంగానే రద్దు చేస్తున్నారు.

మోడీత్వ శక్తుల ఈ దాడిని శక్తివంతంగా ఎదుర్కోగల నైతికశక్తిగాని ఆలోచన గాని కాంగ్రెస్‌కు ఏ కోశానా లేవు. ఎందుకంటే వారు కూడా వాటికి తిలోదకాలిచ్చి బొమ్మగా మాత్రమే వాడుకుంటున్నారు. ఆ బొమ్మను కూడా ఎత్తిపారేస్తుంటే ఏమీ చేయలేని దివాళాకోరుతనంలో పడిపోయారు.

ఆయన కూడా పాలక వర్గ ప్రముఖుడే అయినా నెహ్రూపైనే ఇంతటి దాడి జరగడానికి కారణమేమిటి? ఇది యాదృచ్ఛికమా లేక చారిత్రిక కారణాలున్నాయా? నెహ్రూ నమూనా అనేదాని ప్రత్యేకతలేమిటి పరిమితులేమిటి? సహేతుకంగా ఆలోచించేవారు చరిత్ర విద్యార్థులు తప్పక సమాధానం తెలుసుకోవలసిన ప్రశ్నలివి. వంశ పారంపర్యం కాంగ్రెస్ పెత్తనం వంటి పేర్లతో బిజెపి నెహ్రూ పాత్రపై దాడి చేస్తుంది. దానికి సమాధానం చెప్పేపేరిట కాంగ్రెస్ మొత్తంగా నెహ్రూను ఆయన వారసులను నెత్తినెత్తుకోమంటుంది. ఈ రెండు దృక్పథాలూ పొరబాటే. గాంధీతో సహా నాటి కాంగ్రెస్ నేతలు చాలామంది కంటే నెహ్రూ ప్రగతిశీల ప్రజాస్వామిక దృక్పథం కనపర్చారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, స్వావలంబన, సామ్యవాద పరిభాష వంటివి కనపర్చారు. అయితే అనేక సార్లు రాజీ పడ్డారు. అధికారంలోకి వచ్చాక వాటి నుంచి కొన్నిసార్లు అంతకుముందు చెప్పిన విలువల నుంచి వైదొలగారు. అప్రజాస్వామిక అశాస్త్రీయ ధోరణులకు కూడా పాల్పడ్డారు. ఇది కూడా వ్యక్తిగత కోణంలో గాక పాలక వర్గ పరంగా చూస్తేనే అర్థమవుతుంది.

ఆయా సందర్భాలలో నెహ్రూ తీసుకున్న వైఖరులు చెప్పినవి చేసినవి రాసినవి సాధికారికంగా ఉటంకిస్తూ రణదివే రాసిన ఈ గ్రంథం రాజకీయ విద్యార్థులందరికీ అవశ్య పఠనీయం.

-స్నేహ

వివక్షపై ఎక్కుపెట్టిన ఆయుధం

హిందూమతంలో అణువణువునా దాగి ఉన్న వివక్ష, ఆ వివక్షకు ప్రాతిపదిక అయిన మనుధర్మశాస్త్రంపై ఎక్కుపెట్టిన ఆయుధం 'మనుధర్మ శాస్త్రం శూద్ర దళిత బానిసత్వం'. నిజానికి సివి రచనల్లో ఒకటైన ఈ పుస్తకాన్ని కేవలం ఒక ఆయుధంగా చెప్పడం పొరపాటే. ఇది అక్షయతుణీరం. వివక్ష వ్యతిరేక పోరాటకారులకు, అభ్యదయ శక్తులకు ఈ పుస్తకం అంతులేనన్ని ఆయుధాలను ఒకదాని తరువాత మరొకటిగా అందిస్తూనే ఉంటుంది. శతాబ్దాల తరబడి స్త్రీలు, దళితులు, శూద్రులను అణచివేసిన తీరును, అప్పటి నుండి ఇప్పటికీ కొనసాగుతున్న బ్రాహ్మణ ఆధిపత్య భావజాల తీరును కళ్లకు కడుతుంది. కోటి ఆశలతో, క్రొంగత్త ఆలోచనలతో వికాసం వైపు అడుగులు వేయాల్సిన ఒక జాతిని, ఆ జాతిలోని మెజార్టీ ప్రజలను భగవంతుని పేరుతో, ధర్మం పేరుతో ఎలా అణచివేశారో సోదాహరణంగా వివరిస్తుంది. మనువుతో పాటు విష్ణు స్మృతి, వశిష్ట, ఆపస్థంబ ధర్మసూత్రాల పేరుతో ఆధిపత్య భావజాలం సమాజంపై కక్కిన విషాన్ని, చేసిన పెత్తనాన్ని తెలియచేస్తుంది. ఆయా ధర్మశాస్త్రాల్లోని అంశాలను తీసుకుని అధ్యాయాలు, సూత్రాల వారీగా వాటిలో పేర్కొన్న అంశాలను అందరికి అర్థమయ్యేలా వివరించడం ద్వారా వాటి బండారాన్ని, అణచివేత ధోరణులను అనితర సాధ్యమైన రీతిలో సి.వి. ఎండగట్టారు. ఆ అంశాలను వివరించడానికే పరిమితం కాకుండా వాటిని ప్రతిఘటించడానికి, వివక్ష, అణచివేత లేని సమాజం కోసం చేయవలసిన పోరాటాన్ని, మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలను వివరించారు. తాత, ముత్తాతల ముత్తాతలు అనుభవించిన భయంకర బాధల గాధల్ని సమాజంలో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలంటే మనుధర్మ శాస్త్రాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని, అందులోని శ్లోకాలను వాటి అర్థాలతో సహా సామాన్య ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని సివి చెబుతారు. ఈ పుస్తకంలో ఆయన అదే చేశారు. అలా చేసినప్పుడే 'వైదిక వ్యవస్థలోని బూటకమూ, హిందూరాజ్య స్థాపనలోని కపట నాటకమూ ప్రజలకు తెలుస్తుంది. ఈ విషయాలు తెలిసిన తరువాత భారత ప్రజలు తప్పకుండా కళ్లు తెరుస్తారు. కళ్లు తెరచిన ప్రజలు చైతన్యవంతులవుతారు. చైతన్యవంతులైన ప్రజలు ప్రళయ భీకర సముద్ర తరంగాల్లా విజృంభిస్తారు. ఇది చరిత్ర చెప్పిన పాఠం. ధరిత్ర చెప్పిన సత్యం' అని ఆయన అంటారు.

వాస్తవానికి ఒక తరం తెలుగు పాఠకులకు, సాహితీ అభిమానులకు, అభ్యుదయ శక్తులకు పరిచయం అక్కరలేని పేరు సి.వి. ఆయన అసలు పేరు చిత్తజల్లు వరహాలరావు అయినా, సాహితీ లోకంలో సివిగానే సుప్రసిద్ధులు. 1970వ దశకంలో ఆయన రాసిన రచనలు ఎందరికో గొప్ప ఉత్తేజాన్నిచ్చాయి. మితవాద, మతవాద శక్తులు అధికారంలోకి వచ్చి బూజుపట్టిన భావజాలానికి పట్టం కట్టే ప్రయత్నం చేస్తున్న తరుణంలో సివి పుస్తకాల అవసరం ఎంతైనా ఉంది. అప్పట్లో చైతన్యాన్ని నింపి, ఆలోచనలను రగిలించిన సి.వి. రచనలను పునర్ముద్రించాలని ప్రజాశక్తి బుక్‌హౌస్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఈ పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ఇక పురోగామి శక్తులది!

-వి.రాజగోపాల్



మనుధర్మ శాస్త్రం, శూద్ర దళిత బానిసత్వం,
రచన: సి.వి,
వెల : 60 రూపాయలు, ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్, ప్రతులకు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ కేంద్రాలు.

ప్రకృతి పరిణామ సూత్రాలను తెలిపే పుస్తకం



గతితార్కిక-చారిత్రక భౌతికవాదం, జక్కా వెంకయ్య, ధర: రు.50/-, పేజీలు: 96, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. ఫోన్: 0866- 577533.

అధికశాతం ప్రజలకు చేసుకునేందుకు పనులు లేవు. తినేందుకు తిండిలేదు. నివాసానికి ఇళ్ళు లేవు. మరోవైపు కొద్దిమంది పెద్ద పెట్టుబడిదారులు, భూస్వాములు లాభాలపై లాభాలు గడిస్తున్నారు. అమెరికా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విపరీతంగా లాభాలు గుంజి మన దేశం నుండి తరలించుకుపోతున్నారు. వైజ్ఞానిక సాంకేతిక కళారంగాలలో నానాటికి పెరుగుతున్న సంక్షోభం ఆయా రంగాలలో పని చేస్తున్న మేధావులను కలవరపరుస్తున్నది. ఈ విధంగా అన్ని రంగాలలోని ప్రజలు అత్యంత తీవ్రమైన బాధలకు ఆవేదనలకు నిరాశా నిస్పృహలకు గురి అవుతున్నారు. ఐతే ఈ దుస్థితికి గల కారణామేమిటా అని మీమాంస పడుతున్నారు. ఇదే సందర్భంలో పెట్టుబడిదారీ వర్గ తత్వవేత్తలు ఈ సర్వవ్యాపిత సంక్షోభస్థితికి గలకారణాలనూ ప్రకృతి సమాజ పరిణామ సూత్రాలనూ తెలుసుకోలేమని నిర్విరామంగా ప్రచారం చేసి వాస్తవ విషయాలను తెలుసుకోవాలనుకొనే పీడిత ప్రజలందరినీ గందరగోళ పరుస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం రాతి పనిముట్లు, కూచి కర్ర మెదలైన అత్యంత ప్రాథమిక పనిముట్లను మాత్రమే ఉపయోగించి జీవించిన దశ నుండి నేటి వరకు సమాజ పరిణామ క్రమంలో మానవులు పురోభివృద్ధిని సాధిస్తుండగా ప్రకృతి సమాజ పరిణామ సూత్రాలను అర్థం చేసుకోలేమని చెప్పడం వాస్తవ విరుద్ధం. ఈ పరిణామ సూత్రాలను తెలుసుకొని వీటి ఆధారంగా ప్రకృతిని సమాజాన్ని తమ అవసరాలకు తగినట్లు మలచుకొనగల్గిన శక్తిని మనం సాధిస్తాం. సమాజ చరిత్రే దీనికి తార్కాణం. మనం కూడా ప్రకృతి సమాజ పరిణామ సూత్రాలను అధ్యయనం చేసి అర్థం చేసుకోవటం ద్వారా నేటి మన దుస్థితికి గల కారణాలను తెలుసుకొని ఈ దోపిడి వ్యవస్థను కూలదోసి దాని స్థానంలో ప్రజల హక్కులను పరిరక్షించే జనతా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరుచుకొనగలం. ప్రకృతి సమాజ పరిణామ సూత్రాలను తెలిపేదే గతితార్కిక-చారిత్రక భౌతికవాదం. ✦

తొమ్మిది జంతువులు

మీరు చురుకైన పిల్లలంట కదా. ఇక్కడ తొమ్మిది జంతువుల పేర్లున్నాయి. వాటిని పైనున్న అక్షరాల బాక్స్‌లో కనిపెట్టాలి. అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా వుండొచ్చు. మరి రెడీనా!

F	C	A	T	H
D	O	G	E	O
U	W	X	G	R
C	P	I	G	S
K	O	W	L	E



ఎక్కడ దాక్కుంది?

ఈయనగారు భార్యతో భారత దేశం వచ్చాడు. ముఖ్యమైన ప్రదేశాలు చూడ్డానికి. కానీ ఎక్కడో ఆవిడగారు తప్పిపోయింది. ఇంతకీ మీకేమైనా కనిపించిందా?

(జవాబు: బొమ్మ తిరగేసి చూస్తే... టోపీ పెట్టుకున్న మహిళ కనిపిస్తుంది)

ఇంటికి దారేది?

ఈ అబ్బాయి పేరు సుబ్బు. తన మిత్రులతో కలిసి ఆడుకోవాటానికి బయటికి వెళ్లాడు. తిరిగి తన ఇంటికి చేరుకునే దారి మరిచిపోయాడు.
తన ఇంటికి చేరుకోవాలంటే ఏ దారి గుండా వెళ్లాలో చెప్పండి.



పది తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నా... పది తేడాలున్నాయి. అవేంటో చెప్పకోండి?

జవాబు: 1. అంకుల్ పాదం మారింది 2. బల్ల మూడు కాళ్లలో ఒకటి పోయింది. 3. నలుపు డ్రెస్సు ఆకారం మారింది. 4. నీళ్లు పోసే క్యాను లో ఒక భాగం ఊడింది 5. ఇంటి కప్పు మీదున్న తెల్ల గీత చిన్నదైంది 6. చిన్న చెట్టు నల్లగా మారింది. 7. టీపాయ్ నీడ పొడవు పెరిగింది 8. ఇంటి మీదున్న పొగ గొట్టం మాయమైంది 9. ఇంటి గోడ మీదున్న గీత 10. మూడు పూలున్న గుత్తిలో ఒకటి మాయం.

చుక్కలు కలపండి



ఏనుగు బొమ్మ గీద్దామా!

పిల్లలు మీకు ఏనుగు అంటే చాలా ఇష్టం కదా.
మరి ఏనుగు బొమ్మను ఏలా గీయాలో నేర్చుకుందామా మరి!



పది గుడ్లు ఎక్కడ ఉన్నాయి!

పిల్లలు అడవిలో వివిధ రకాల పక్షులు,జంతువులు ఉన్నాయి. వాటి మధ్యన గుడ్లు దాకున్నాయి అవి ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టండి.

ఇంగువ సాంబారు

కావలసిన పదార్థాలు
కందిపప్పు - పావుకిలో
చింతపండు -50 గ్రాములు
దాల్చిన చెక్క - చిన్న ముక్క
ధనియాలు - 50 గ్రాములు
ఇంగువ - కొద్దిగా
వెల్లుల్లి - 10 రేకలు
అల్లం - చిన్న ముక్క
ఆనబకాయ - 50 గ్రాములు
ములక్కాడలు -3
ఎండుమిర్చి - 3
ఉప్పు - సరిపడా
పసుపు - చిటికెడు
జీలకర్ర - 25 గ్రాములు
ఉల్లిపాయలు -4
యాలకులు - 2
లవంగాలు - 2
గుమ్మడి కాయ - 50 గ్రాములు
కొత్తిమీర, కరివేపాకు - కొద్దిగా
కొబ్బరికోరు - అరచిప్ప

తయారు చేయు విధానం
ముందుగా కందిపప్పును మెత్తగా ఉడికించి మిక్సీలో వేయాలి. కూరగాయలన్నీ తరిగి పెట్టుకోవాలి. చింతపండు రసంలో ఉప్పు, పసుపు, తరిగిన కూరగాయ ముక్కలు, కొబ్బరి ముద్ద, కరివేపాకు వేసి ఉడికించాలి. బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. దినుసులన్నీ అందులో వేసి వేయించి మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి. బాగా ఉడికాక దినుసులతో చేసుకున్న సాంబార్‌పొడిని వేసి ఒక పొంగు వచ్చాక దింపాలి. దింపే ముందు కొత్తిమీర వేసుకోవాలి. స్టౌమీద బాండీపెట్టి కొద్దిగా నూనె వేసి కాగాక తాలింపు గింజలు, కొద్దిగా ఇంగువ వేసి సాంబారులో కలుపుకుంటే ఇంగువ సాంబారు రెడీ..!.

రసం



కావలసిన పదార్థాలు
ధనియాలు - 100 గ్రాములు
చింతపండు - 100 గ్రాములు
జీలకర్ర - 20గ్రాములు
పచ్చిమిర్చి - 2
పసుపు - కొద్దిగా
మెంతులు - 1 స్పూను
ఆవాలు - 1 స్పూను
మిరియాలు -20గ్రాములు
వెల్లుల్లి - 3 రేకలు
బెల్లం - సరిపడా (తీపి ఇష్టపడేవాళ్లకి)
టొమాటో - 1
కొత్తిమీర, కరివేపాకు - కొద్దిగా

తయారు చేయు పద్ధతి
రసం పొడి కోసం జీలకర్ర, మెంతులు, ఆవాలు, ధనియాలను కొద్దిగా నూనెలో వేయించుకుని పొడి చేసి పెట్టకోవాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లి ముద్దగా నూరి పెట్టుకోవాలి. అరలీటర్ నీటిలో ఈ రసం పొడిని వేసుకుని మరగబెట్టుకోవాలి. అందులోనే కొద్దిగా పసుపు, ఉప్పు, బెల్లం నూరిన వెల్లుల్లి, పచ్చిమిర్చి ముద్ద వేయాలి. బాగా మరిగాక దింపే ముందు కొత్తిమీర, కరివేపాకు వేయాలి. కళాయిలో నూనె వేసి తాలింపు వేసి కాగబెట్టుకున్న రసంలో కలుపుకుంటే చాలు. నోరూరించే రసం తినడానికి సిద్ధంగా ఉన్నట్టే.

మద్రాసు సాంబారు

కావలసిన పదార్థాలు
కందిపప్పు - అరకేజీ
చింతపండు - 100
పచ్చికొబ్బరి - అరచిప్ప
ఇంగువ - కొద్దిగా
నూనె - 200 గ్రాములు
బెల్లం - 50 గ్రాములు
ఉప్పు - తగినంత
ఎండుమిర్చి - 15
ధనియాలు - 4 స్పూన్లు
ములక్కాడలు - 4
వెల్లుల్లి - 6 రేకలు
ఉల్లిపాయలు - 4
తాలింపు గింజలు - 2 స్పూన్లు
టొమాటోలు - 4
మిరియాలు - 1స్పూను
మినపప్పు -2 స్పూన్లు
శెనగపప్పు - 2స్పూన్లు
పసుపు - కొద్దిగా

తయారు చేసే విధానం
కందిపప్పు మెత్తగా ఉడికించి మిక్సీలో వేసుకోవాలి. ములక్కాడ ముక్కలు, టొమాటో ముక్కలు చింతపండు, పప్పును రసంలో వేసి ఉడికించాలి. అందులోనే ఉప్పు, బెల్లం, పసుపు వేసి మరగనివ్వాలి. ధనియాలు, మినపప్పు, శెనగపప్పు, ఎండుమిర్చి, మిరియాలను కొద్దిగా నూనెలో వేసి వేయించి పొడి చేసుకోవాలి. కొబ్బరి, వెల్లులి కూడా ఆ పొడిలోవేసి మెత్తగా చేసి మరిగే చారులో వేయాలి. రెండు సార్లు పొంగువచ్చాక దింపేముందు కొత్తిమీర చల్లుకోవాలి. బాండీలో నూనె వేసి కాగాక తాలింపు గింజలు వేసి వేగాక కొద్దిగా ఇంగువ వేసుకొని సాంబారులో కలిపితే మద్రాసు సాంబారు తయార్.

తొక్కలో ఆర్ట్





తొక్కే కదా అని తీసి పారేయకూడదన్నది స్టీఫెన్ బ్రూచె సిద్ధాంతం. చూశారుగా అరటిపండు తొక్కమీద ఎన్నేసి బొమ్మలేసి అదరగొడుతున్నాడో! ఈ డచ్ కళాకారుడికి అరటి పండుమీద కూడా బొమ్మలేయొచ్చన్న ఉపాయం వచ్చింది మాత్రం ఇప్పుడు కాదులెండి! తను ఇన్‌స్టాగ్రామ్‌ను వాడడం మొదలెట్టిని తొలిరోజుల్లో. 'ఏం బొమ్మ పోస్ట్ చేద్దామబ్బా...?' అనుకుంటుండగా ఎదురుగా అరటి పండు కనిపించిందట. ఏదైనా వత్తిడి తగిలితే అరటి పండు కమిలిపోయి నల్లగా మారుతుందన్నది తెల్సిన విషయమే కదా. అప్పడా పండుమీద ఇతగాడికేదో ఆకారం కనిపించింది. అంతే! బాల్ పాయింట్ పెన్నుతో తను మనసులో అనుకున్న ఆకారాన్ని గీసేసి అప్ చేసేశాడు. అలా తొక్కల బొమ్మల ప్రస్థానం ప్రారంభించిన స్టీఫెన్ ఇవాళ ప్రపంచ ప్రసిద్ధుడైపోయాడు. మార్లిన్ మన్రో, హోమర్ సింప్సన్ మొదలుకొని జిరాఫీ, ఏనుగు వంటి ఆకట్టుకునే జంతువుల బొమ్మలు, బైబిల్ ఘటనల వరకు వేసేస్తాడు. మొట్టమొదట అతను వేసిన యాభై కళాఖండాల ఫొటోలతో 'ఫ్రూట్ డూడుల్' అనే పుస్తకాన్ని తయారుచేశాడు. ప్రస్తుతానికి కళాకృతులు సృజించడానికి ... పళ్లు కుట్టుకునే పుల్లలు (టూత్‌పిక్స్), చెంచాలు ఉపయోగిస్తున్నాడు. అదండీ! స్టీఫెన్ అరటి తొక్క అర్ట్ వెనక వున్న స్టోరీ ! ●

స్టీఫెన్ బ్రూచె

అబ్బో...ఎంత పే..ద్దవో!

కూరలు వండుకోవాలన్నా, పళ్లు తినాలన్నా... బుట్టలతో తెచ్చుకోవాల్సిందే. అదే ఇప్పుడు మీ ముందు కొలువు తీరిన గుమ్మడి కాయ, ఉల్లి, క్యారెట్, కీరా, చిలగడదుంప, టమాటా, బంగాళ దుంప, పుచ్చకాయ, క్యాబేజీ, పుట్టగొడుగులు... అయితేనో..! ఒక కుటుంబానికే కాదు. ఏకంగా ఓ పెళ్లికి విచ్చేసిన వారందరూ సుష్టుగా భోజనం చేయడానికి సరిపడా వంటకాలు తయారు చేసేయొచ్చు. ఇవి ఇంత పే...ద్దగా పండుతాయని ఎవ్వరూ కలలో కూడా ఊహించరు. ఆఖరుకు వాటిని పండించిన రైతులు కూడా. వీటిని బ్రిటన్, అమెరికా, చైనా దేశాలకు చెందిన రైతులు పండించారు. రికార్డులూ సృష్టించారు. చూశారుగా! ఒక్కో దాన్ని ఒంటి చేత్తో మోయడం ఎంత కష్టంగా వుందో!

మనమూ ఓ ప్రయత్నం చేసి రికార్డు వీరులుగా పేరు కొట్టేయొచ్చేమో! ●